# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204978
UNIVERSAL LIBRARY

# Osmania University Library

Call No. T81 6 S94J

Accession No. T1365

Author సుబ్బారావు, రాయప్రోలు.

Title జడ కుచ్చులు. 1925.

This book should be returned on or before the d last marked below.

# జడకుచ్చులు

కర్త:

రాయప్రోలు సుబ్బారావు

వెల ౧-౦-౦

బెజవాడ, ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల (లిమిటెడ్) యందు

క. కోదండరామయ్యగారిచే ముద్రింపబడియె.

౧౯౨౫.

# విజ్ఞప్తి

ఇందలి పద్యములు పలుపత్రికలనుండి యేరికొంటిని. ఆంధ్రభారతి, గ్రంథాలయసర్వస్వములు అందుముఖ్యములు. ఏతత్పత్రికాధిపతుల ఇయ్యకోలున కెంతయుఁ గృతజ్ఞుఁడను. చేర్పఁదలచిన మఱికొన్నిపద్యములు విస్మృతి గహనముపాలై దొరకినవికావు. రసికులకిం దేవియేని రుచించినఁ గృతకృత్యుఁడను.

—గ్రంథకర్త.

౪౧. పాయలు పాయలుగా విడి

పోయిన నా తెనుఁగుకన్నె ముంగురులను వే

ణీ యోగ్యాభరణముగా

నీయెడ జడకుచ్చు లల్లి యిచ్చితిఁ బ్రీతిన్.

# జన్మభూమి

ఏ దేశమేగినా ♦ ఎందుకాలిడిన
ఏ పీఠ మెక్కినా ♦ యెవ రెదురయిన
పొగడరా నీతల్లి ♦ భూమి భారతిని
నిలుపరా నీజాతి ♦ నిండుగర్వమ్ము
లేదురా యిటువంటి ♦ భూదేవి యెందు
లేరురా మనవంటి ♦ పౌరు లింకెందు.

ఏ పూర్వపుణ్యమో ♦ ఏ యోగబలమో!
జనియించినాడ వీ ♦ స్వర్గఖండమున
ఏ మంచిపూవులన్ ♦ ప్రేమించినావో!
నిను మోచె నీతల్లి ♦ కనకగర్భమున.

సూర్యుని వెలుతురుల్ ♦ సోకునందాక
ఓడల జెండాలు ♦ ఆడునందాక
నరుడు ప్రాణాలతో ♦ నడుచునందాక
అందాకగల యీ యను ♦ నంత భూతలిని
మనభూమివంటి క ♦ మ్మని భూమిలేదు.

తమతపస్సులు ఋషుల్ ♦ ధారవోయంగ
చండవీర్యము శూర ♦ చంద్రు లర్పింప

రాగదుగ్ధము భక్తి ♦ రాజు లీయంగ
భావసూత్రము కవి ♦ బాంధవు లెల్ల

దిక్కుల కెగఁదన్ని ♦ తేజంబు వెలుఁగ
జగముల నూగించు ♦ మగతనం బెగయ
రాలు పూవులు సేయు ♦ రాగాలు సాగ
సౌందర్య మెగఁబోయు ♦ సాహిత్య మొప్ప

వెలిగిన దీదివ్య ♦ విశ్వంబు పురి!
దీపించె నీపుణ్య ♦ దేశంబు పురి!

అపమానమేలరా! ♦ అనుమాన మేల!
భరతపుత్రుఁడనంచు ♦ భక్తితోఁ బలుక!

# తమ్ముడా!

శ్రీలు పొంగిన ♦ జీవగడ్డయి
పాలు పాఱిన ♦ భాగ్యసీమయి
వ్రాలినది యీ ♦ భరతవర్షము
భక్తి పాడర తమ్ముడా!

౨ వేదశాఖలు ♦ వెలసె నిచ్చట
ఆదికావ్యం ♦ బలరె నిచ్చట
బాదరాయణ ♦ పరమఋషులకు
పాదు సుమ్మిది తమ్ముడా!

౩ విపిన బంధుర ♦ వృక్ష వాటిక
ఉపనిషన్మధు ♦ వొలికె నిచ్చట
విపుల తత్త్వము ♦ విస్తరించిన
విశ్వమణి యిదె తమ్ముడా!

౪ సూత్రయుగముల ♦ శుద్ధవాసన
క్షాత్రయుగముల ♦ చండ శౌర్యము
చిత్రదాస్యము ♦ చే చరిత్రల
చెఱిగిపోయెర తమ్ముడా!

౫ మేలికొన్నర ♦ మేళవించి
రాలు గరుగగ ♦ రాగమెత్తి
పాల తీయని ♦ బాల భారత
పదము బాడర తమ్ముడా!

౬ నవరసమ్ములు ♦ నాట్యమాడగ
చివురుపలుకులు ♦ చెవుల విందుగ
కవితలల్లిన ♦ కాంత హృదయుల
గారవింపర తమ్ముడా!

౭ దేశగర్వము ♦ దీప్తి చెందగ
దేశచరిత్రము ♦ తేజరిల్లగ
దేశ మరసిన ♦ ధీరపురుషుల
తెలిసి పాడర తమ్ముడా!

౮ పాండవేయుల ♦ పదునుకత్తుల
నుండి మెఱసిన ♦ పురాత రణకథ
కండగల చి ♦ క్కని తెనుంగుల.
కలిపి పాడర తమ్ముడా!

౯ లోక మంతకు ♦ కాక పెట్టిన
కాకతీయుల ♦ కదన పాండితి
చీకిపోవని ♦ చేవమాటల
చేర్చి పాడర తమ్ముడా!

౧౦ తుంగభద్రా ♦ భంగములతో
పొంగి నింగిని ♦ పొడచి త్రుళ్ళీ
భంగపడని తె ♦ నుంగు నాథుల
పాటబాడర తమ్ముడా!

## తమ్ముడా!

౧౧ పసుపుకొంగుల ♦ ముసుంగు లెడలగ
కొసలు తీర్చిన ♦ కోరకత్తుల
కసరిపోరిన ♦ గండు యోధుల
పదము బాడగ తమ్ముడా!

# ఆంధ్రమాత

శా. శ్రీలింపొందగ యావదాంధ్రజనమా ♦ త్మప్రఖ్యాతిలీనాత్మ తే
జోలీలామృతమాని, దద్బలవశా ♦ త్పుణ్యంబునన్ తావకో
ద్వేలప్రాక్తన కీర్తిగీతముల న ♦ ర్థింబాడు నీపుత్రి పు
త్రీలోకమ్మున కేమిచెల్లెదవు సం ♦ దేశంబు నాంధ్రావనీ!

శా. ఆశల్ కౌతుకపూర్ణచంద్రికలు పూ ♦ యన్ మద్ధనాచ్ఛాదమా
కాశమ్మున్ విడిపోవ, నూతనకళో ♦ త్కృష్టాప్తమై మాత్మ పూ
జాశోభల్ దయివారు నీశుభదినో ♦ త్సాహంబునీక్షించి, నీ
యాశీర్వాదములిమ్ము పుత్రులకు సం ♦ బా! యాంధ్రదేవీమణీ!

శా. తేటల్ దేరెడు కాంతిపూరముల నా ♦ ద్దీపించు ముత్యాల పా
ప్పేటల్ బోలె త్వదీయకంఠమున శో ♦ భింపుల్ నిగారించు, చే
నాటన్ జీవనశోషణాల్ గనని కృ ♦ ష్ణాగౌతమీ భద్రలన్
గాటంపుందమిఁ ద్రావువారమిపె కాం ♦ క్షాక్షీరమాంధ్రావనీ!

శా. ఆ చాళుక్యనృపాలరత్నముల వి ♦ ద్యావ్యమ్మది, శ్రీకాకతి
ప్రఖ్యాచక్రేశుల లాలనల్ వడసి, కృ ♦ ష్ణప్రాజ్యసామ్రాజ్య పీ
ఠీచంచజ్జయకన్యతో సరసగో ♦ ష్ఠిన్ ప్రొద్దుపోఁబుచ్చు, నీ
ప్రాచీనాభ్యుదయమ్మునెన్నెదరు గ ♦ ర్వస్ఫూర్తి తల్లీ! సుతుల్

శా. ఉద్యన్మోహనమై, దుమారజన గ ♦ ర్వోద్రేకమై, యాత్రిలిం
గోద్యానాప్తమధూదయమ్ముగునవీ ♦ నోత్సాహపున్ వేళ, నా

విద్యారణ్యయుగంధరాదుల యశో♦విర్యమ్ము లగ్గించు, చీ
విద్యాస్నాతకు లానఁజేసెదరు, దే ♦ వీ! సంప్రసాదింపవే.

ఉ. జారిన దేశగౌరవముఁ ♦ జక్కనదిద్ది, మహాంధ్రమాడలీ
భారము శ్లాఘనీయముగఁ ♦ బాలనఁజేసిసమానరాష్ట్రముల్
కూరిమినానఁ జేయుచు, తెలుఁ♦గుంబుడమిన్ గయిసేయుచుండ్రయ్యా, దీ
ప్తారతి నాంధ్రప్రభుత్వులు! జ♦గజ్జనధర్మము దృష్టి నిల్పుచున్.

శా. ఉల్లాసమ్మున మాతృసేవ పయిపై ♦ నస్తూతుంగాగంగ నా
పల్లీ పక్కణ దిగ్దిగంతర తలీ ♦ పర్యంత వేంగీభువిన్
జల్లుండాంధ్రసుసాహిత్యమప్రథమపూ♦జాపుష్పముల్ ప్రేమవుం
ద్రాళ్ళంగట్టుఁడు యావదాంధ్రజనసం♦తానమ్ము నా పైహితుల్.

సీ. రణరక్తబంధురా ♦ యణమైన ఖిస్తతి
కన్న కత్తికడిగిన ♦ కవనభూమి ౧
అమృతాక్షరవికాస ♦ మయిన యా సుకవి పో
తనలేఖిని ప్రశాంతిఁ ♦ గనినచోటు ౨
భాషాకుమారిక ♦ బ్రవుఁబెండ్లియైన
కృష్ణరాజ్యము వెలిం ♦ గినతలమ్ము ౩
నానావిదేశనా ♦ కానీక విపులాశ్ర
యంబైనరేవు రూ ♦ పఱిన తావు ౪

---

౧. పాలేటియొడ్డు, ౨. ఒంటిమిట్ట, 3. విద్యానగరము, ౪. బాపట్లసమీపపు మోటుపల్లి.

గీ. పాడయి శిలావశిష్టమై ◆ ప్రాప్తకాల
మనుభవించుచు, నుండియు ◆ నక్కటకట!
బ్రతికిచెడ్డయాంధ్రుల పూర్వ ◆ వైభవంబు
చాటెడిని నాలకింపుడు ◆ శాంతమతులు!

మ. కలదాంధ్రోద్యమవల్లికాకుసుమరే ◆ ఖామాలికాకాంతి తుం
దిలశోభాంకురపుంజముల్ భరతమా ◆ తృస్ఫీతచూడామణీ!
కలితచ్ఛాయల నందగింపఁగల భా ◆ గ్యంబింక, నీసాంగమం
గళకళ్యాణముఁ బాడఁ బుత్రికలవే ◆ డ్కన్ వత్తురానాఁటికిన్.

శా. సంతోషింపగదమ్మ! యాంధ్రజననీ! ◆ సారస్వతస్నానవి
శ్రాంతిప్రీతుల, నీదుపుత్రకుల, దీ ◆ క్షాబద్ధులఁ జూచి ని
శ్చింతన్ సోదరులారా! భూజననిఁ బూ ◆ జింపుండు బ్రహ్మర్షణో
దంతవ్యాప్తిమనోబలమ్ము పదధా ◆ స్త్రంచుక్ బుషుల్ పల్కఁగన్

# ప్రబోధము

అమరావతీపట్ట ♦ ణమున బౌద్ధులు విశ్వ
    విద్యాలయమ్ములు స్థా ♦ పించునాఁడు
ఓరుగల్లున రాజ ♦ వీరలాంఛనముగాఁ
    బలుశస్త్రశాలలు ♦ నిలుపునాఁడు
విద్యానగర రాజ ♦ వీథులఁ గవితకు
    పెండ్లిపందిళ్ళు గ ♦ ప్పించునాఁడు
పొట్నూరికి సమీప ♦ మున నాంధ్రసామ్రాజ్య
    దిగ్జయస్తంభ మె ♦ త్తించునాఁడు

గీ. ఆంధ్రసంతతికే మహి ♦ తాభిమాన
దివ్యదీక్షాసుఖస్ఫూర్తి ♦ తీవరించె
నా మహావేశ మర్థించి ♦ యాంధ్రులార!
చల్లుఁ డాంధ్రలోకమున న ♦ క్షతలు నేఁడు॥

సీ. తనగీతి యమృతవా ♦ హిని పాటకులనుగా
    దిద్ది వర్ధిల్లిన ♦ తెనుఁగువాణి
తనపోటులు విరోధి ♦ తండంబులకు సహిం
    పనివిగా మెరసిన ♦ తెనుఁగుకత్తి
తనయందములు ప్రాంత ♦ జనుల కభిరుచి వా
    సన నేర్ప నలరిన ♦ తెనుఁగురేఖ
తనవేణికలు వసుం ♦ ధరను సస్యశ్యామ
    లను జేయుఁ జెలఁగిన ♦ తెనుఁగుభూమి

గీ. అస్మదార్ద్రమనోవీథి • నావహింప
జ్ఞప్తి కెలయించుచున్నాఁడ! • చావలేదు
చావలేదు ఆంధ్రులమహా • జ్జ్వాలచరిత్ర
హృదయములు చీల్చిచూపుఁడో • సదయులార!

సీ. కృష్ణాతరంగ పం • క్తిక త్రొక్కి త్రుళ్ళింత
నాంధ్రనౌకలు నాట్య • మాడునాఁడు
ఇంటింట దేశి సా • హిత్యదీపములతో
నాంధ్ర తేజస్సు రా • పాడునాఁడు
సుకుమారశిల్పవ • స్తు ప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంతె • మాడునాఁడు
సమదసేనావ్యూహ • జయపతాకల క్రింద
నాంధ్రపౌరుషము చెం • డాడునాడు

గీ॥ చూచి, సంతోషమున తల • లూఁచి, గర్వ
మూచి, ఆంధ్రపుత్రీపుత్రు • లందఁగలరు
శాంతి, నందాఱ లేదు వి • శ్రాంతి మనకు
కంకణావిసర్జనల కిది • కాలమగునె॥

# పుస్తకము

నిండాఱఁబాఱున ♦ ఖండగోదావరి
దాగిన చాళుక్య ♦ నాగరికత,
పాడైన పెనుకోట ♦ గోడల దీర్ఘధ్వని
ద్రులువోవు కాకతి ♦ ప్రాభవమ్ము
పల్లెపదాల జీ ♦ వముగనిల్చికొన్న వ
ల్నాటివీరుల రక్త ♦ నాళపటిమ,
కడలేక యొప్పు తుం ♦ గాభద్ర కెరటాల
మఱఁగిన ప్రాజ్యసా ♦ మ్రాజ్యభరము

తే. గీ. హృదయములువిన పలుకక ♦ చదువుజెప్పు
పుస్తకతపస్విని తెలుంగు ♦ పూలపాదల
నిలిచి సేవాశకమ్ములఁ ♦ బిలిచిపిలిచి
స్థిరత పాడించుగాత జా ♦ తీయగీతి॥

సీ. ఆచారమునకు దా ♦ స్యముఁజేయుచును వంట
యిల్లుదాటఁగలేని ♦ యిందుముఖుల,
ఉదయాస్తమయములు ♦ నొడలిచెమ్మటఁదీసి
క్షేత్రసేవలుజేయు ♦ సేద్యగాండ్ర,
బ్రతికినన్నాళ్ళు తీ ♦ అనికస్తి, రెక్కలు
విఱిచిజీవించెడు ♦ పేదజనుల,
అక్షరపంక్తులె ♦ యఱయరాదనుచు, దు
ర్గతులఁద్రోసిన చెప్పు ♦ రాసివాండ్ర,

తే. గీ. పూలతో నిండి కన్నార ♦ నాలుచిన్న
పుస్తకనికుంజపుంజాళి ♦ పొంతఁబిలిచి
“నా జనమ్ము, నాదు దేశ” మ ♦ నంగఁజాలు
ఇంత జ్ఞానభిక్షాదాన ♦ మిమ్ము తల్లి!

సీ. ఆంధ్రుల శిల్ప వి ♦ న్యాసంబు చూపించు
కలిమి గోపురముల ♦ గలదటంచు
ఆంధ్రనాగరికత ♦ ప్రాణచిహ్నములైన
గానసాహిత్యముల్ ♦ గలవటంచు
ఆంధ్రభాగ్యమ్ము మో ♦ యగ గౌతమీకృష్ణ
దరుల నావలు ♦ దిరిగెననుచు
ఆంధ్రవీరులకు స్వ ♦ ర్గాతిథ్యమిచ్చి పా
టలు పాడిన యుగమ్ము ♦ కలదటంచు

తే. గీ. చెప్పియొప్పించు పుస్తక ♦ శ్రీకుమారి
యుండగింపఁగఁ గల యాల ♦ యములుగట్టుఁ
డాంధ్రదేశమునందెల్ల ♦ నాంధ్రపుత్రు
లాప్తమానవసంఘసే ♦ వానురక్తి॥

# వసంతము

[శ్రీ రవీంద్రనాధ ఠాగూరు విరచితము.]

నేను వచ్చానమ్మ ♦ నేను వచ్చానె
ఆలసింపక రారె ♦ ఆడుకొందాము.

* * *

ఏడాది తొలికానుగ ♦ ఎచట దాచారె ?
నా ప్రాణపల్లకి ♦ నేడో [illegible]రె ?
తేనె వసంతాల ♦ తీర్చి[illegible]డి
పసుపుకోకలు [illegible] ♦ దసిరూపు దాల్చి
నేను వచ్చానమ్మ ♦ నేను వచ్చానె
ఆలసింపక రారె ♦ ఆడుకొందాము.

వేకువే వికసించు ♦ వేసాలమొల్ల !
ప్రొద్దుప్రొద్దున పూయు ♦ మా [illegible] !

మవ్వములొరువ్వేటి ♦ మాధ్వా[illegible] !
అందాలుపిదికేటి ♦ సందెవంగి !
పరిమళం బెగబోయు ♦ పచ్చగోరంట!
పైరగాలికినవ్వు ♦ పడుచుగేవంగి !

నేను వచ్చానమ్మ ♦ నేను వచ్చానె
ఆలసింపక రారె ♦ ఆడుకొందాము.

* * *

చూచినామోయి కు ♦ చ్చుల పూలరంగ !
నీముద్దురూపు వ ♦ న్నెలకోడెకాడ !
చిగురుపాగాచెంగు ♦ లెగిరి జీరాడ !
పడుచు ప్రాయము తీవి ♦ పగిలిపోవంగ
తోపుచీరెలమావి ♦ దాపలిదిశల
విరజాజిపందిళ్ళ ♦ వెలపలిపొదల
 నిన్నుజూచామోయి ♦ నెఱజాణతనక !
 నీకు చిక్కామోయి ♦ పోకిళ్ళపుట్ట !

* * *

ఎవ్వరే ననుబల్క ♦ రించేరు ఇచట
మురళివాయిస్తు నే ♦ పోవుచుండగను

* * *

మావికొమ్మను నేను ♦ మన్మథాకార !
నిలుపఁజాలనిరక్తి ♦ నిన్ను పిల్చేను.
నిన్నుజూడకమున్నె ♦ నీదివ్యమూర్తి
నీపూతవాసనల్ ♦ రాపాడి నన్ను
నాచిత్తబలమెల్ల ♦ దోచెంగదోయి !
నాగర్వరాగంబు ♦ లాగెంగదోయి !
నిన్నెఱుంగకముందె ♦ నిన్నుభావించి
ప్రేమించినానోయి ♦ బేలనై స్వామి !
 మావికొమ్మను నేను ♦ మన్మథాకార !
 నిలుపఁజాలనిరక్తి ♦ నిన్ను పిల్చేను.

* * *

తొలిజాము చల్లగా ♦ తొలగినపిదప
ఆటపాటలశక్తి ♦ సొలసిన వెనుక
వీధిలోపల ధూళి ♦ వేడియెత్తంగ,
కడవల నీరాన ♦ కాకు లేగంగ,
వేసవి తలసూప ♦ నేసొక్కిసోలి
నిష్క్రమింతావేళ ♦ నిలుతురే మీరు?
ఎవ్వరే నను బల్క ♦ రించేరు ఇచట
మురళివాయిస్తు నే ♦ పోవుచుండగను.

నేను వస్తానోయి ♦ నేను వస్తాను
మొగ్గమల్లెను నేను ♦ మురిపాలమొలక!
నీయుత్తరీయంపు ♦ నీడబట్టికొని
నీకప్పురపుతమ్మ ♦ నిగ్గునందికొని
నీనిల్వుతిలకమ్ము ♦ లోన చెమ్మగిలి
నీరాగమాలలో ♦ దారమైపెనగి
వలపుతో కడదాక ♦ నిలిచియుంటాను
ఆసతోనందాక ♦ అంటియుంటాను.

* * *

సన్నజాజిని నేను ♦ సరసాలచైత్ర!
తేనెచిన్కును నేను ♦ తీపారుపుత్ర!
నీ సిగపూలలో ♦ వాసనై యణగి
నీకంఠమాలలో ♦ రేకునై కలసి
పూలు రేకులుకూడి ♦ పాలుపారుదాక
తమ్మితూడునగూడి ♦ తనివొందుదాక

నీ వాక్కు కర్థమై ♦ నే వెల్గుతాను
నీ చూపు పావనై ♦ నే నటిస్తాను.

* * *

ఎడబాట్లు కలిగేటి ♦ యెండకాలమున
ననుపీడించు కృశింపు ♦ ననరాణి యెవతె?
నా వేణువునకు కరు ♦ ణామృతగానమూది
అప్పగింతలు పాడు ♦ నార్ద్రకాలమున
ఎల్లెడ కారాకు ♦ లల్లాడు వేళ
అంటియుంటా రెవ్వ ♦ రవుదు నాదండ.

* * *

గన్నేరు మొగ్గనే ♦ గరువాలగత్తె!
నిన్ను పోషించాను ♦ నిండారుకూర్మి
నీదు కౌగిట నన్ను ♦ నిలుపని మ్రోళ్ళాయి
నీశయ్య నన్ను రా ♦ నింపని మ్రోళ్ళాయి
నీనవ్వు చల్వలో ♦ నానని మ్రోళ్ళాయి
నీలాలనసుఖాన ♦ సోలని మ్రోళ్ళాయి.
నేను వస్తానోయి ♦ నేను వస్తాను
వచ్చి నీవెనువెంట ♦ వలచియుంటాను.

* * *

మందారమును నేను ♦ మాధ్వీపిపాసి
నీదు పచ్చనిరూపు ♦ నే కోరినాను
ఏకిన్నెరస్వరాన ♦ ఎలుగెత్తి మమ్ము

పిలిచితో ఆముద్దు ♦ పిలుపులోపల నె
కలదు నీదుపిఱోఁగ ♦ గద్గదస్వరమె.
నే నెఱుంగుదునోయి ♦ నీరహస్యములు.

* * *

ఎందుకో ఆలస్య ♦ మెందుకో అలత
ఎందుకో సందేహ ♦ మెందుకో కొఱత
అందుకోవోయి ! మో ♦ హనసూత్రధారి
నా ప్రేమపూజ లం ♦ దవు దండఁగట్టి.

# శుక్తి

వాఙ్మయము మహాంభోదధిం బడి ప్రాకులాడు
దహరవహము నేను; శ్రాంతి విశ్రాంతిగాఁగ
తారకలు సూపిన దిశాపథంబుఁ బట్టి
రాగిణుల[1] కాళ్లయందెల రవళి నెనసి.

*　　　　*　　　　*

నీరదములు నర్తించిన దారులంది
కాలఖేలన మొందొందుఁ గలయఁ ద్రిప్ప
నందు నందెల్లఁ బారవశ్యమునఁ బోదు
పరిమళము త్రిప్పు తుమ్మెద బాలలీల.

*　　　　*　　　　*

లేదు లేదు నిర్బంధపాలిత పథంబు
నా సువర్ణతరణికి విలాసమణికి.

*　　　　*　　　　*

ఒక్కవీచి ముంపఁగ మఱియొక్కవీచి
తేల్పఁగ, నగాధ పాతాళ తిమిర మొక్క
మాఁ అపారనభం బొక్కమాఱుఁ జూతు
పగలు రేలు పాటించెడి ప్రాణిపోల్కి.

*　　　　*　　　　*

కాటియందలి ధూమాంధకారభరము,
పడకటింటి కర్పూర దీపపు మెఱుంగు,

---

1 గాన పక్షమందు రాగశబ్దము స్త్రీవాచకము

నొక్కగతిని నానావకు దిక్కుఁ దెలుపు
లేదు వ్యక్తికి ఛాయావిభేదమతము.

*　　　　*　　　　*

పోయిపోయి సంపాదింపనాయె నాకు,
ఒక్క శ్రావణ రజనీ వియోగవేళ
చినుకువన్నెల ముత్యపుఁ జిప్పయొకటి
తొలగిపోని తారకలె యిందులకు సాక్షి.

*　　　　*　　　　*

కడల కరదులు కరదులై వెడలుచుండె
మధుర జలధరపంక్తులు,—మాతృగర్భ
కుహరమునువీడు ప్రేమ పంక్తులవిధాన
పాదమును రామణీయము నందఁ బ్రకృతి.

*　　　　*　　　　*

లసదుషఃకంతధవళమాలలు గనఁబడె
నెలలబాలింత స్తన్యధారలవిధాన,
భావరేఖయుఁ గుటిలకంపనముమాని
సుప్తవిరహిణి భ్రూలతాక్షోభఁబోలి.

*　　　　*　　　　*

ఆమధురశక్తిహస్తము నందగింప
కడలియొడ్డెక్కితిఁ;—కాని గానవైతి

కలయ వెదకియు వందెందు దొలుత నేను
దిగినసన్నపురేఁ వేమి దృగ్భ్రమంబొ?

*　　　　*　　　　*

తీరమునకుమాఱొడ్డి యుద్భిన్నములయి
క్షుభితకల్లోలగతిఁ గొట్టికొనెడి యలల
గాఢకోలాహలంబింత గానరాదు
మెత్తని యిసుకపడకల నొత్తిగిల్లి.

*　　　　*　　　　*

అతివిశాల, మతిస్నిగ్ధ, మతిమనోజ్ఞ
మయిన యాతీరసికతాపథాంచలమున,
ఒకనియడుగులజాడ, వేఱొకడువచ్చు
వఱకె నిలదు పారావారపాలనమున.

*　　　　*　　　　*

లేచిపడి నశించిన ప్రతివీచియందు
నుదయమందు వేఱొకనూత్న నుదితవీచి
చెఱఁగిపోయిన ప్రతిపాంథుచరణచిహ్న
ములను వేఱొకనికి శుద్ధతలముదొరకు.

*　　　　*　　　　*

ఆవిలాసము నాహృదయము హరించె
రజనిసంధ్యాకషాయ చిత్రమునుబోలె,

తిరుగుదింక, స్వచ్ఛందసుందరవిపంచి
కాలతావశమగు స్వరగతివిధాన.

* * *

ఏను దెచ్చిన హృదుశక్తిలోని జాతి
ముత్యములను లోకముముందుఁ బోయువాడ
హృద్యమై యొప్పువానిని నేఁకొనుఁడు
అభిరుచికొలంది రౌద్రసౌమ్యముల నరసి.

* * *

సొగసుహృదయము సుకుమార సుమముబోలె
చేతి కందించువాడ రసికజనులకు !
కంఠమాలల ధరియింత్రొ గౌరవమున
రేకులనుఁజించి యావల పాఱేయనెంత్రొ!

* * *

రుచిచకితమైన హృదయసరోజగర్భ
మందుఁ గందళించిన భావ మంద మొంది;
వాణినై యెప్పు వెలువడు వదనమందు
అపుడె సుకవికి స్వాధీనమయ్యెఁ గవిత.

# వసంతవికాసము

౧

తరుణ కుసుమశిఖా సూత్రధారివగుచు
ముసుగు లేఁతల భేదము లోదవనీక
నిఖిల తరుజగతికిని నందించినావు
సహృదయానందరాగ రంజనము చైత్ర!

౨

కలికికోయిల గొంతులో మొలకగీతి,
సోయగపుఁ బూలపొత్తులఁ దీయతేనె,
పోసితో మెప్పు డప్పుడే పులకరించె
నాహృదయశయ్య కవితోపగూహనమున.

౩

కొమ్మ కొమ్మన, నాకు నాకున నలంది,
పూవు పూవునఁ, జివురు చివురునఁ జిందఁ
జిలికితివి నూత్నచైత్ర కాశ్మీరరుచులు
పుడమి సవరమ్మునకు వన్నెలిడ వసంత!

౪

మోళ్ళు మోసెత్తె నిల మూలమూలలందు
నందమెగఁబోయు చైత్రుని యాగడముల
కీడ్వఁబడి మేలిముసుగింత మెత్తె గగన
భామ, లినకన్నెతపసెల్ల భంగపడఁగ.

౫

మోదమున మోజుపడి కుసుంభాంశుకాల
మంగళించిన యువని నానందబద్ధ
నయనములఁ జూచి చూచి యున్మాదియయ్యె
మధుతపస్వి కిం కేభాపిఃధమొ నడవ?

౬

పొదలవాకిండ్లు తెఱచి యాపువ్వుపుత్ర
కులకు, నూతనావిర్భావ కోమలాస్య
రేఖ లెత్తించె స్వచ్ఛంద ప్రియుఁడు చైత్రు
డార్ద్రరాగాంకితలు నల్లి యువనిమీఁద.

౭

ఏమిటికిఁ బొంచిపొంచి లాలించెదోయి!
బాళి బాల గులాబీల జాలిమాలి,
మొగము లెత్తవు; లజ్జచే వలపుమొలక
దాటిరాలేక తెప్పల దాగులాగు.

౮

చక్కని నభంబు రంగులఁ బిక్కటిల్లె
నిండుజవ్వని యారుణంపు గండమట్లు,
రాగగీతలఁ జెలరేగ భోగపవనుఁ
డప్సరసల నృత్యోత్సవ లిప్సలీల.

౯

వీధికడపటి వ్యాకుల వేణుకుంజ
మాలపించె హ్లాద మనోజ్ఞమయిన పాట,
కోమలసమీరుఁ డాడించు కులుకుకొమ్మ
త్రిప్పులనుఁగూడ గానమే రేకెత్తె.

౧౦

పవను నడుగుల రవళికిఁ బట్టి కెరలి
కెవ్వుకెవ్వన నవ్వ పక్షివిచయంబు,
తల్లిపొలకువ నాలించి దాదికోలఁ
గిలకిలల మేలుకొను బాలికలవిధాన.

౧౧

పత్రవస్త్రాపహరణ విదితుఁడయిన
శిశిరు వివృతవిజిజ్ఞాస సీదరంచి,
చిగురుచెంగావి కోకలిచ్చితివి మాధవ
నీమతల్లుల సంవృతనీతి నెఱిఁగి.

౧౨

మొగలిరేకుల మును వర్షపుత్రకుండు
వ్రాసిన శుభాక్షరంబులు మాసిపోయె,
అధరరేఖవంటి కషాయ మధురపల్ల
వమున నీవైన చెరఁగని పంక్తి నిలుపు.

౧౩

ఏదెసను ద్రెంచితి జగంబు నేమఱించి
మధురగీతా సరసిగట్లు మధుపిపాసి!
అఖిల మానందసుఖసుప్తమయ్యె నింక
మేలుకొలుపు వైతాళిక లేరు రారు!

౧౪

తేనెఁ దిని నర్తనాసక్తిఁ దియగు నళులు
పాయలై పాయలై గానఁబడియెఁ గడల,
స్నానగంధవాసనలు సాంద్రముగఁ బెరయ
నాఁటివిడచిన మనులక్ష్మి యలకలనఁగ.

౧౫

ఇగురుమావులఁ గోడెకోయిలల లేపె,
మిసమిసలపూల చెఱఁగులఁ బసపుఁబూసి,
పచ్చివలపుకాకల నెత్తుపడిన దాగ
సరళిఁ బాడించెను వసంత! జగతిచేత.

౧౬

సమదపికములు పాడు స్వచ్ఛందగీతి,
దక్షిణసమీరుఁ డేగు స్వాతంత్ర్యవీథి,
స్వేచ్ఛగాఁ బూచె మంగళగుచ్ఛలతలు,
జగతినేలు నూత్నప్రాణ మొగయ దింక.

౧౭

సుఖనిశీథము, గీతికాముఖరపథము,
సరసపవనము, సుమదళచకితవనము,
పెనఁగి నిలువంగనీయవు మనసులోని
ప్రియగతులఁ గంఠముఖమునఁ బెకలకుండ!

౧౮

చచ్చిపోవు కారాకుల స్థానములను
చిగురుచేవలు మొలుచు సౌష్ఠవముగనుచు,
మృత్యువున కేలో భీతివహింత్రు జనులు
అవల స్వచ్ఛందసౌందర్య మబ్బుచుండ.

# శేషచైత్రము

ఇరుగు పుట్టిండ్లలో ♦ నెడిగిన యెలమి
కొమ్మల యొడులలోఁ ♦ గులికిన కలిమి
మృదువనస్పతులలో ♦ మొలగిన చెలిమి
వైశాఖమును జూచి ♦ వదలదే చైత్ర!

౨

పూల కౌగిండ్లలో ♦ నోలలాడితివి
సరసుల పొత్తులో ♦ సఖ్య మాడితివి
పసిపైరగాలిలో ♦ పరువు లాడితివి
మండుటెండల సవి ♦ మానెదే చైత్ర!

౩

రమణుల చరణాల ♦ రాచిన లాక్ష,
అబలల యధరాల ♦ నంటిన తమ్మ,
కన్నెల నుదురుల ♦ కందిన చాదు
ఎన్నాళ్ళ మురిపెమో ♦ యెఱుఁగుదే చైత్ర!

౪

కోయిల పాటలోఁ ♦ గోముల స్వరము
మలయమారుతములో ♦ మధుర వాసనలు
కలికి పూగుత్తిలోఁ ♦ గమ్మని మధువు
అనుభవిం తెందాక ♦ నందాల చైత్ర!

౫

పత్త్రాలు రాల్చితి ♦ పచ్చనిచెట్ల
జీవనక్షామమ్ముఁ ♦ జేర్చితి నదుల,
పనిపాట లావల ♦ బంపితి విఁడ్ల,
చాలదే నీపాలి ♦ జయమింకఁ జైత్ర!

౬

మధుపాతమున భూమి ♦ మురిపించినావు
సుఖరక్తిఁ ప్రజలను ♦ పాలించినావు
పగలు దీర్ఘములుగాఁ ♦ బాటించినావు
చాలవే యీనాళ్ళు ♦ చక్కని చైత్రి!

౭

కష్టమో సౌఖ్యమో ♦ గడపితి విచట
నీ మంచి కాలంబు ♦ నీటుగో బెగయు
దుఃఖింప కవసాన ♦ దురవస్థ కిపుడు
కాలచక్రము నాప ♦ గా లేము చైత్ర!

౮

నవనవ లాడేటి ♦ చివురాకులెల్ల
కటికెక్కెనెండ కా ♦ కలుబోలె ముదిరి,
సవ్యవాతములు దు ♦ స్సహములై రేగ
నిప్పులు గ్రక్కుచు, ♦ నెయ్యంపు చైత్ర!

౯

నీ సౌఖ్యసంపదల్ ♦ నీ భోగరుచులు,
గ్రీష్మున కిట్టు ల ♦ ర్పింపఁగా వలసె
నంచు నాఁకులపడ ♦ కవసాన చైత్ర!
ఉదయాస్తమయతత్వ ♦ మిదియె సు మ్మిలను!

## పూవు

౧

చెలియల సిగ లోఁ ♦ జెలువారు పూవ
పడతుల జడలపై ♦ బవళించు పూవ
సఖుల ముచ్చటముళ్ళ ♦ నవరించు పూవ
లలనావతంసమ్ము ♦ లను గుల్కు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౨

అలవిచ్చి సిగ్గులన్ ♦ గరఁగేటి పూవ
మొగ్గవై మోజులన్ ♦ మొలిపించు పూవ
పూచి శోభనములన్ ♦ బోదివిన పూవ
దళముల కౌగిలిం ♦ తలఁజొక్కు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౩

చిగురాకు మరుఁగునఁ ♦ జెలువారు పూవ
కొమ్మలసందిళ్ళ ♦ గొనలెత్తు పూవ
ఎండకు కాగని ♦ యెలపూత పూవ
వెన్నలన్ పేరని ♦ వెలుతురు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౪

కడుపులో తేనెలు ♦ కల కన్నెపూవ
తనువున గంధాలు ♦ దయివారు పూవ

రెక్కల నందాలు ♦ గ్రక్కేటి పూవ
మోమున లావణ్య ♦ ములు రాలు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౫

పసుపు కేసరములన్ ♦ మిసిమించు పూవ
నిగనిగ సొగసులన్ ♦ బిగివోని పూవ
పెండ్లింట్లపాలించు ♦ ప్రేమంపు పూవ
వీరుని కంఠాన ♦ విప్పారు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౬

కాపురకన్నియ కొప్పు ♦ గైసేయు పూవ
ఉపవనాల నుయ్యాల ♦ లూగేటి పూవ
తోటకంచెల వన్నె ♦ తోఁబూచు పూవ
అడవిడొంకల నంద ♦ మయియొప్పు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౭

సెలయేటి పాటలన్ ♦ జెవియొగ్గు పూవ
తుమ్మెద సఖులతో ♦ తుళ్లేటి పూవ
పైరగాలికి విచ్చి ♦ వర్ధిల్లు పూవ
రంగుల రాశివై ♦ రాణించు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౮


కళలకళ్యాణివే ♦ కమ్మని పూవ
సౌందర్యసరసివే ♦ చక్కనిపూవ
భావాలబరిణవే ♦ బంగారు పూవ
చిన్నెలచిలుకవే ♦ సింగారి పూవ
పోవకే! మాతల్లి ♦ పూజ కోపూవ!

౯

పెరిగినా! తరిగినా! ♦ ప్రియమేనె పూవ
చచ్చినా! బ్రదికినా! ♦ స్వర్గమే పూవ
ఓడినా! గెలిచినా! ♦ ఒప్పేనె పూవ
తొలగినా! కలసినా! ♦ తోడేనె పూవ
పోదాము! ఆతల్లి ♦ పూజకే పూవ!

# పూజ

౧



చందమామ పూవెన్నెలల్ ♦ జల్లులాడ
బిళ్ళ పులకరింపంగ నెల ♦ మేళ్ళు పాడ
విశ్వమునం బచ్చతోరణాల ♦ విరిసియాడ
వ్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౨

కొనలు త్రోళ్ళను వెరపేది ♦ పొదలు వెడలి
చిన్ని మొక్కలు పైలము ♦ చేవ గ్రక్క
జీర్ణ మారలియు మ్రోగను ♦ జీవరుతుల
వ్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౩

పొంగిపొడిచిన నమలెల్ల ♦ క్రుంగఁజూచి
ఆకసముఁ బ్రాకు వరదనూ ♦ క్షీణఁగ గాంచి
త్రుళ్ళి త్రోపాడు మేఘముల్ ♦ తొలగసరసి
వ్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౪

సస్యములకుఁ గాలిచ్చు వా ♦ త్సల్యవతులు
మంగళతరంగిణులు, క్షీర ♦ భంగి చెప్ప
నాలకించితి భావర ♦ హాస్యములను
వ్రేలవే! తల్లిమెడనుపూ ♦ జాలలంతి!

౫

చెరగిపోని చక్కని లిపిగా ♦ చెక్కినారు
ఆంల భాగ్యభారతి శాస ♦ నాల ఋషులు
వానదెబ్బల తుప్పిప్పడు ♦ వాసె, చదివి
ప్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౬

తెలుఁగునెత్తుట వెలిగిన ♦ దీపకళలు
తెలుఁగుపాలఁ బేరిన మీగ ♦ డల తెరకలు
తెలుఁగుతేన తీయందన ♦ మ్ములను దనిసి
ప్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౭

భక్తుఁ డొక విగ్రహము తల ♦ పయిననుంచ
వీరుఁ డొక అయుధము మీఁదఁ ♦ బెట్టి గొలువ
కర్షకుం డొక కాడికిఁ ♦ గట్టి మ్రొక్క
ప్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౮

కన్నె పసుపక్షులు నల్ల ♦ గౌరిపేర,
దేవిపేర కుంకుమను శా ♦ క్తేయులీయ,
విప్రులు సరస్వతీదీక్ష ♦ విరులొసంగ,
ప్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౯

కవులు కవితామధువుచే జ ♦ గమ్ముఁ దడుప,
శిల్పకులు కుంచికలఁ చేత ♦ తెలుపు దిద్ద,
గాయకులు గాత్రరక్తి రా ♦ గముల నెత్త
వ్రేలవే! తల్లిమెడను పూ ♦ జాలలంతి!

౧౦

పంజరములోని చిలుకల ♦ పాటలందు,
అడవిలోని గోర్వంకల ♦ నుడులయందు,
ఒక్కటే శ్రుతిచెదరక ♦ పిక్కటిల్లె
వ్రేలవే! తల్లిమెడనుపూ ♦ జాలలాంతి!

# విరహవీధి

హేమపాత్రల చందన ◆ మెండిపోయె
ద్వారములు మోయుచున్నవి ◆ హారములను
సానలం దింకె స్నానక ◆ షాయగంధ
మబల! యెవనకోసము నగ ◆ మయి కృశింతు.

గీ. చెక్కుచెదరని పాటల ◆ చిక్కువడియె
వేణిబంధము శిథిలమై ◆ పిడుఁడులందె
కరఁగి జారగిన తిలక రే ◆ ఖలను దుడువ
వతివ! యెవఁడాహరించె నీ ◆ యార్ద్రహృదిని.

గీ. పాలుపొంగినగతి పొంగు ◆ ప్రణయాసక్తి
నాపుకొనలేని పడుచు ప్రా ◆ యంబుతోడ
నమ్మి యెవనికి నీమన ◆ మమ్మికొంటి
వువిద! యీమేఘమాస న ◆ వోదయములు.

# పిలుపు

నిశలు పులకించెఁ గనులకు నిదుర రాదు
పైదలి! యేమిటికి నన్ను బాధపెట్ట?
ఏపొదలదాగి పాడె దీ హృదయవిదళన
దారుణములైన నగ్నగీతమ్ము లెత్తి. ౧

నావిరహగంధగీతి కన్వయముఁ జెప్ప
శిరసు లెత్తుచు నున్నవి చిగురుపొదలు,
నవ్వుచున్నది కడల నందంపుసందె
కావిరంగుల రంగైన మోవివిరిచి. ౨

కొసరియాడుంబసపు చెఱఁగులనులాగు
గంధవహుని కౌఁగిటనుండి కరుణపదము
లల్లుచున్నది స్మృతులఁ బ్రాయంపువంశి
నాహృదయ వేదనాలాపనములఁ గరఁగి. ౩

వలపు పచ్చనిదని రక్తిమొలవఁబాడి,
విరహ మరుణమని యెద తపింప వినివి,
చెలిమి నల్లనిదని, నిరసింతు విపుడు
ప్రేమ ధవళిమమని యింక వినుతు వెపుడు! ౪

# మధుమాలి

ఆకసమ్మునఁ బూవులేయందగించె,
వసుధకమ్మునఁ బూవులే పవ్వళించె,
ఆలయమ్మునఁ బూవులే యాటలాడె,
ఏలపాడదు తుమ్మెద పూలపాట. ౧

పవనుకౌఁగిటఁ బూవులే సవదరించె
హృదయమందునఁ బూవులే రేకులెత్తె;
తోఁటలోపలఁ బూవులే తొలకరించె,
ఏలపాడదు తుమ్మెద పూలపాట. ౨

ఎన్నియెన్నిభవంబుల నేమియేమి
పూజలనుజేసి పట్టితీ పూలనోము!
చైత్రు సహవాససుఖము లేచాయ నబ్బె
తేటసేయుము తుమ్మెదా! పాటఁబాడి. ౩

## తుమ్మెద.

కష్టములను శారదచంద్రికలవిధాన,
దుఃఖములను తొల్కరివానతునుకలట్లు,
లనుభవించితి,—చిత్త మాహ్లాదపులక
వివశమయి సేయునృత్యమ్ముగా విడువకుండ. ౪

స్తన్యభరశీతలంబైన జననియొడిని,
పరిమళప్రగాఢమగు భామపాన్పునందు,

వేదఋక్పూతమగు యజ్ఞవేదిమీఁద
నెలమి—నాదుకౌమారమే నిలిపికొంటి. ౫

ఆటలాడితి వెన్నెల యాలలపోల్కి,
పాటలను బాడితిని సెలయేటిపగిది,
సంకెలలు కాళ్ళయందెల చాయఁగొంటి,
అన్నిటను—బాల్యలీలలే యనుభవించి. ౬

పాటలు తలాడఁగాఁగని పవ్వళించి,
పాటలను జెలికత్తెలభాతిఁ బిలిచి,
పాటలే నవయాత్రకుఁ బథముఁ జూప
వచ్చితిని, యాంపకమ్ముల పాటతోడ. ౭

ఇంతకన్నను నోము లే నితర మెఱుఁగ,
ఈశ్వరుఁ డనుగ్రహించె నా కీ భవంబు.
నవ్వుచును బుట్టి, నవ్వుచు నవకమొంది,
నవ్వుచును బోదు—నిదియె నానగ్నలీల. ౮

పాంథుఁడు.

మధుప! యేటికి చంచలపథముఁ గొంటి
వాక్కుపువునకుఁ బెట్టుము 'చక్కిలింత'
లొక్కపువునఁ బాసింపఁ గ్రుక్కుకొందు
వాక్కుపూవును గీతితో నుత్సహింతు. ౯

అంతులేనియాకసమునఁ గొంతిసేపు,
కుటిలపవనవీచికలందుఁ గొంతసేపు,

కువలయోన్మీలరేఖలఁ గొంతసేపు,
త్రుళ్లిపడుచుఁ దిరిగెదు మత్తునివిధాన. ౧౦

తుమ్మెద.

చంచలుఁడనౌదు నవనికిఁ జలనమొసఁగ,
విరహినగుదు శుష్కితులకు వేడిదార్ప,
మత్తుడనగుదు జతలకు మత్తువెట్ట,
లేదులే దన్యతం బిందు లేశమయిన. ౧౧

ఒక్కపువుపొంత నాడుదు, నొక్కపూవు
పజ్జఁబాడుదు, నొకపూవుసెజ్జమీఁద
శిశువువలె నిదురింతు నీ చిత్రదశల
చక్కదనములులేక నా జన్మమేల? ౧౨

చిత్తచాంచల్యమన్నను సిగ్గులేదు
మతిభ్రమణమనినను నవమానపడను,
నన్ను నాపూలనెడఁదీసి భిన్నభిన్న
మార్గముల కీడ్వకున్న నమస్కరింతు. ౧౩

తారలన్నను, మణులన్న, తనయులన్న
పులుఁగులన్న, గీతములన్న, పూవులన్న
నామవాచక భేదముల్ నాకుమాత్ర
మన్నియును బూవులేయగు నార్ద్రదృష్టి. ౧౪

పూలకొలకయిపుట్టితి, పూలలోని
తీయతేనెను దీయుచుఁ దిరుగువాఁడ,

నెపుడు నాడుచుఁ బాడుచు నిదియె—నిజము,
భ్రమయొ; యున్మాదమో; కైపొ; వలపొ; సొలపొ! ౧౪

ఈమధువ్రతమును తుద కెల్లజరిపి
వదలుమును తేనె పెరలతోఁ బాటుఁ బృథివిఁ
బిదప నరయుఁడు చంచలహృదయుచంచ
రీకగీతిసంగ్రహమును బ్రీతితోడ. ౧౫

ప్రేమచేఁ జెమ్మగిల్లిన హృదయరాగ
ములను నడిపింప కాల్వ లెందులకుత్రవ్వ?
నడుపనిమ్ము నచ్చినభంగి నొకపుపొలయు
వాలకముతో నెడాపెక వాఁకలట్లు. ౧౬

—∞✾✾∞—

# గీతాం వేహి

౧

కన్యా మీరాబాయి.

ఇంత తపించెద ♦ వేమిటి కింతీ!
కాంతి విరహమున ♦ కగ్గి కృశింప
వలపులువాడిన ♦ ఫలమేమిగలదు
వాసనవోయిన ♦ ప్రసవము లేల.

ప్రేయసివని నడి ♦ రేయి నేతెంచి
వాకిట నిలచినఁ ♦ బలుకకపోతి !

సంజెకడల నిండు ♦ సంజెము కురులు
దువ్వుకొనుచున్న ♦ నువ్వువు సొగసు
చూచిచూచి సకియా! ♦ సోలినమనసు
ఆపంజాలక విర ♦ హంబున వెడలి.

మెల్లమెల్లన నును ♦ పిల్లనగ్రోవి
వాయించినాను నీ ♦ వాకిలిముందు
చూడవైతివి నను ♦ సుందరి యెపుడు
కడగన్నుల రాగ ♦ కళికలు గురియు.

జాఱిన పయ్యెద ♦ చెంగులు గనక
చెమరించు చెక్కుల ♦ చేష్టలు గనక
ఉయ్యాల లూచెడి ♦ యుత్తమవేళ
కయ్యాలు సవరించు ♦ తియ్యనివేళ.

నీహృదయము కరు ♦ ణించునో యనుచు
నీ రాగములు రవ ♦ ళించునో యనుచు
అలత "గీతాందేహి" ♦ యని పాడినాఁడ
"ధన్య మీరా" యని ♦ తలపించినాఁడ.

నాగర * గురుచర ♦ ణంబుల మఱఁగి
లోకాపవాద వి ♦ లోలత కడలి
నను జూడ లజ్జించి ♦ తనుపమగాత్రి!
ననుఁగూడఁగ నను ♦ మానము పడితి.

౨

## దాసీక్షేమ.

సాధింపులేలోయి ♦ సాహసకాడ!
ఈదీనురాలితో ♦ నేమి వాదాడ
నీరూపురేకల ♦ నెమ్మని వలచి
ఎన్ని వెన్నెలరేల ♦ నీడ్చితి వగల.

మబ్బులు గ్రమ్మిన ♦ మాపులయందు
పులుగులు పాడిన ♦ తొలిజాములను
నీనీడలే భ్రమ ♦ లోన సృష్టించి
నీయడుగులజాడ ♦ నే యాలకించి.

నడిరేయి యనకయె ♦ నకనక పడుచు
పడకటింటితలుపుల్ ♦ ఘట్టన తెఱచి

* నాగరుఁ డను తాపసి మీరాబాయి గురువు

త్రుళ్ళుచు నటునిటు ♦ త్రోవలు సూచి
యడియాసపాలయి ♦ యూరడి కడలి.

అందెలు మ్రోగునో ♦ యని జంకిజంకి
కుచ్చెళ్ళ పెళపెళ ♦ కను క్రుంగి క్రుంగి
సిగ్గున మ్రగ్గుచు ♦ జింతఁ గుములుచు
ఎన్నెన్నివారులు ♦ చిన్నవోయితిని.

మీరాబాయి, క్షేమ—వీరు ఉత్తర హిందూస్థానపు భక్తురాండ్రు. వీరు పాడిన గీతములు భక్తిపరవశములుగ గానము చేయబడుచున్నవి. ఈపై రెండుపాటలును హిందీపదములకు యథానువాదములు.

మీరాబాయి

నీతిమాలిన దని ♦ నిందించెదరు
జాతిజాఱిన దని ♦ శాసించెదరు,
సిగ్గువిడిన దని ♦ చిన్నమాటాడి
పరవశురాలని ♦ పాపముల్ పలికి,
వీధులఁ బోవఁగ ♦ వేలెత్తి చూపి
నొవ్వఁజేసిరి నా ♦ మువ్వాపు మనసు
విసపు గిన్నియ నా ♦ పెదవిని జేర్చి!
కసిదీర్పుమా “ నా ♦ గిర ” గురుమాళీ!

# ప్రవాసరాధిక

చ. చదలు పయోదమాలికల ♦ శ్యామలమయ్యె దమాలపంక్తులన్
కొదమవనమ్ము చీకటుల ♦ కున్ నెలవయ్యెఁ, గుమారభీరుఁడీ
యదుసుతుఁ డిల్లుఁ జేర్పు మని ♦ యానతిడి నందనిదేశ మాలకిం
చి తెసలుసూచు చుంజని యొ ♦ స్నేహతపస్విని రాధ యొంటిమై.

మ. కడలం గాల్వడ నేగు ప్రోవుల నై ♦ గల్ గానఁగా రావు, చే
పెడు పాలిండ్లరుచుల్ మరుల్ గొలుపగో ♦ ప్యాదమ్ము పోలేదు, పెం
పుడు లేళ్లైనఁ గదంబకుంజముల దా ♦ పుం జేర పిసంజరా
యిడి పక్షీముఖముందు నెందలసితో ♦ యీ! ముగ్ధగోపాలకా

గీ. చెదరివిరిసిన యాఁబెయ్య ♦ కదుపులెల్ల
మందఁ గొనఁగ నాకర్షించు ♦ సుందరాను
రాగ రాగగీతికలైన ♦ రావు కృష్ణ!
యెంత చెవియొగ్గివినిన నీ ♦ ప్రాంతమందు.

ఉ. పచ్చనియాకుజొంపముల ♦ పైఁబడు నందపుసందె వన్నియల్
విచ్చిన సిసిగన్ ప్రతిఫ ♦ లించిన మించులు నేని దోఁప వీ
ముచ్చటమైన తోఁపున వి ♦ ముగ్ధుఁడ! దట్టపు చెట్లనీడలం
జొచ్చితొ? యల్లిక్రొన్ననగ ♦ సుంబొదలంగను చాటులైతివో!

చ. పొనపొనబూలపిండికణ ♦ ముల్ కణముల్ దొరలంగ పూతమో
చిన మొలదీవయిండ్లకడఁ ♦ జిక్కని నీ చరణాంక రేఖికల్

గనఁబడ, వార్ద్ర దర్భలు సగమ్ము సగమ్ము గ్రసించు చావలన్
జవిన కురంగపుత్రికలు సైతము చూపవు నీదుజాడలన్.

ఉ. పాదములొత్తుకో నిసుక వాగులరేవుల కాలఁద్రిప్పి యా
యాదరులం బ్రదోషసమ యప్రియ రాగములాలపించు వే
ణూదయభాగ్యమొందఁగెనోయి? కుమారయశస్వి! పల్లవ
స్వేదము లైక అంగిన ససిన్ వెలయింపవు పో వనస్పతుల్.

# సఖీసంవరణం

(రవీంద్రమహాకవి పదావళినుండి తెనిగింపఁబడినది)

౮౦

తలింతలె నాడు ♦ కాంతుని వగలు
సెగలయి నాయెడ ♦ తెగ దహియించు
కసికర మెఱుఁగడె ♦ కపట నాటకుఁడె
ఆడుదాని రహస్య ♦ మారయు లేడె

అబలల కతిథిగా ♦ నరుదెంచు ప్రియుడు
సంజెలు గ్రుంకక ♦ ముందేలరాఁడో?
చిరగట్టక మెయి ♦ సింగారములు
సవరింపక పూల ♦ సరులు ముడువక
ప్రాలుమాలికతోఁ ♦ బవళించియుండ
బిరబిర వచ్చునె ♦ ప్రియవల్లభుఁడు
ఏమని వలదంచు ♦ నా మోహానుని
కాదని పల్లెత్తి ♦ వాదాడలేనె;

దినమంతయు తటి ♦ తీపితోఁగడపి
సందెలఁ బిలుచుచు ♦ సఖులను బంపి;
నగలు పెట్టుకొని యుం ♦ దమ్ములు దిద్ది
సన్నపావడ సోగ ♦ సారగఁ గట్టి
కర్పూరపు దీపి ♦ కలు వెలిగించి
పరిమళములు చిమ్ము ♦ పాన్పు లమర్చి
పన్నీరొలికెడి ♦ పందిలిచాయ
రాయంచలాడు స ♦ రస్సుల కెలన

వీణతంతుల నాల ♦ పించుచుఁ గొంత
వేణుగీతల వల ♦ పించుచుఁ గొంత
తనకోసము విదాళి ♦ తాళఁగలేక
ప్రణయవేగము మది ♦ భరియింపలేక
జాలితనంబున ♦ వేచిననాఁడు
నాచాయ రాఁడేమి ♦ నా నాయకుఁడు
నన్నుజూచుచు వద ♦ నం బటు త్రిప్పి
తొలఁగిపోవును "పిర ♦ తొడే" చెలియా!
సైపఁజాలక లేమి ♦ దీపము దీసి
శయనింపఁబోయెడు ♦ సమయమునందు
చోటిమ్మని నోలు ♦ చును వచ్చు సఖిరో!
లేదని పల్లెత్తి ♦ లేనప్పుడైన
వాకిటి పొంచి నా ♦ వల్లభుఁడుండ
చూచి మోసగలేదె ♦ సుదతి నామనసు.

* * *

తోడివారలు నేను ♦ త్రుళ్లుచునుండ
పెదత్రోవల తాను ♦ నడుచునె ప్రియుఁడు
వంచిన మొగమెత్తి ♦ కాంచఁడే యొరుల!
పరితాప మించుక ♦ పలుకఁడె హితుఁడు.
నాథుని చేష్టల ♦ నామదిఁజూచి
ఆనందమే మిథ్య ♦ యని తలపోతు.

ఒక్కొక్కమాఱు వి ♦ యోగపు వగల
హృదయ మింతింతలై ♦ చెదరి తపింప;
తీయని ప్రేమకుఁ ♦ దోయిలిఁబట్టి
ఆసపెట్టిన యడి ♦ యాసకు మ్రొక్కి;

“అబలల హృదయము ♦ లధివసియించి
పరిపాలించు నో ♦ ప్రణయతపస్వి!
పరులఁ బ్రేమించుట ♦ పాపము సుమ్మీ!
అంతకన్నను కష్ట ♦ మవనిని లేదు.

జగముల నేలెడి ♦ సర్వమయుఁడవు
నాగసులఁ గరఁగెడి ♦ సుందరాంగుఁడవు
ఆనందసాగర ♦ మం దందమయిన
గడుసుబంగరు నావ ♦ నడుపఁగ లేవె?
అన్నెముపున్నెము ♦ నారయ లేని
ఈయబలల భ్రమి ♦ యింపగ నేల?
నీవునీవని లాలి ♦ నీయపుగతుల
నమ్ము వారిని వగ ♦ కమ్మఁగ నేల?
ఈయూడుంబట్టు ♦ విఁక నాకుఁ జాలు
పూలదండఁగ నను ♦ బుట్టింపవోయి!
తమ్మిపూవుగ నను ♦ దయజూడవోయి!
కనకచేలముగ నన్ ♦ గరుణింపవోయి!”

అని తలపోసెడి ♦ యర్ధరాత్రముల
విసివి వేసారిన ♦ విసమపు నిశల

ప్రాణముపైఁ గాంక్ష ♦ వదలిన వేళ,
ప్రేమపైన విరక్తి ♦ ప్రాపించిన మొదల,
కిలకిల నవ్వుచు ♦ కేళీనిరతి
నందగాఁడై చెల్వ ♦ చిందెడు వగల
ననుడాయఁగవచ్చి ♦ నానిద్ర లేపి
నను పరవశఁ జేయు ♦ నానాగతుల;
తహతహఁ దార్చు వి ♦ రహబాధ లెల్ల
అప్పు డసత్యము ♦ లని యెంచికొందు.

* * *

ఎన్నితిప్పలు పెట్టి ♦ యెంతొ వేచినను
ఎడబాయఁ జాల దీ ♦ హృదయం బలసి
పలుభవముల యందు ♦ పలువేసములను
ననుగరగించిన ♦ నాయకుఁ డితఁడు,
అభిమాన మెడలిన ♦ నవమానమయిన,
అఖిలలోకమ్ములు ♦ నాడిపోసినను
నాథునిపై నిల్చి ♦ నగ్నమ్మయిన
నాయనురాగము ♦ మాయదే చెలియ!

* * *

# మేఘము

శా. ఆకాశంబున జీలుకాడె సొగసై ♦ యాషాఢయోషాసితం
బాకీర్ణాలకజాలకంబులన పా ♦ యల్ పాయుసై మేఘముల్,
రాకాచంద్రవిలాసముల్ ముసుఁగువా ♦ ఱన్ నైల్యమాల్యంబులై
ప్రాకెన్ జీకటిచెట్లసోయగపుపూ ♦ రంగుల్ దిశాంతమ్ములన్.

సీ. చినుకుచిన్కనుఁ జీ ♦ లిన చిన్ని రేకుల
తోడ పద్మంబు ల ♦ ల్లాడఁ దొడఁగ
ధారధారను మాఁపు ♦ తెగిలిన చిగురుల
తోడ కొమ్మలు సొంపు ♦ లోడఁగడఁగ
జల్లుజల్లునఁ దృ ♦ ష్ణలు సళ్ళు తీయుమ్మ
తోడ చాతకము ల ♦ త్త్రావసాగ
ఉరుమురుమునను సం ♦ బరమైన మొలకల
తోడ వేఁకువులు తూ ♦ గాడనయ్యె
గీ. ఖేదమును మోద మవనికి ♦ గీలుకొలిపి
ప్రోషవయు నటియింతు వా ♦ షాఢలక్ష్మి!
పల్కలేక ప్రాల్మాలు నా ♦ నాల్కగూడ
క్రొత్త చక్కిలిగింతల ♦ గుస్తరింప.

ఉ. ఎండిన బీళ్ళయందు నద ♦ యించిన పచ్చిక కండ్లపండువై
యుండగ చూడియాలుతల ♦ లూపుచుఁబోయెడి, క్రొత్తనీటిచే
వింపెఁదటాకగర్భములు, ♦ నిష్కుటముల్ కడుశ్యామలంబులై
మెంచుకొనెన్ వనిన్, మొగిలుమేసెఁ బ్రభాతములందుఁగొండలన్.

శా. నీడల్ గట్టఁగ భూమియందు, చదలన్ ♦ వ్రేలాడు కాదంబినీ
చూడాకృష్ణకలాపగుచ్ఛములపైఁ ♦ జూడ్కుల్ కటాక్షించి, లీ
లాడోలాసుఖలాలనీయరతి సో ♦ లన్నాగ నృత్యోత్సవ
క్రీడోన్మాదములై మయూరములు సా ♦ రెన్ పింఛముల్విప్పుచున్

గీ. కదలిమూలలనుండి పి ♦ క్కటిల లేచి
బొబ్బరిల్లుచు మబ్బులు ♦ పోవనాగె,
గుబ్బెతలు చిత్తచపలత ♦ గుబ్బటిల్ల
చల్లని మిథఃకలాపముల్ ♦ చనువుకొనుచు.

# ఎవరు ?

## I

ఆఱుచున్న కలంకారి-చీరచెఱఁగు
లనఁగ నాశాముఖంబుల నందగించె
భాద్రపదనీలనీరదపంక్తు లపుడు
వ్రాలుచుండె నభోమణి వాడుకళల.

తామ్రవర్ణప్రవాహంబు దరులుదాటి
వఱదఁబెట్టినయట్లు చూపట్టె సంధ్య
మఱలి చనుచుండెఁ బసువులు మార్గలక్ష్మి
యాటలాడుచువలచు నొయ్యారినడల.

కృష్ణయొద్దున నేకాంతకేళిఁ గోరి
కూరుచుంటివి యొకచోటఁ, గొండనీడ
లాలయఁగఁ గుమారకోమలములయుపవన
మల్లనల్లనఁ గెరలి యుయ్యాలలూఁగ.

ఎఱుపువిఱుగదయ్యె నేటిసేలు, నొకింత
మునిఁగియుండె తెల్లుపూలపడక,
దరులనలుపు మిగుల దర్శనీయమ్ముగ
నచ్చటచటఁ గానవచ్చుచుండె.

కృష్ణవేణియందెలమ్రోత యింపువోలి
లాలిత తరంగ భంగి మాలావసరణి
శ్రవణలాలన మొనరించె, పరిసరమున
వేణువు లనుశ్రుతుల మురిపెములఁ గొలుప.

నిండికొన్న సంధ్యారామణీయకంబు,
పొంగిపొరలు స్రవంతీతరంగశోభ,
యొండొరుల ముద్దులాడుచు నుల్లసిల్లె
లసదపూర్వప్రణయలగ్నలాలనమున.

ఇంతలోన రక్తిమ కృశించిపోయె,
చీకటిజడల్ ముడుల్ విచ్చి చిందులాడెఁ
గాని విశ్రాంతిఁ గనలేదు కర్మ మోహ
లలితమైన వీచీవేగములిగితి.

పొదలయందొందొ కనరాక పూర్వపుణ్య
ఫలమునఁ ద్రోవరులనులాగు సుమములెన్ని,
కటికచీకటిలోపలఁ గానరాక
పాడుచుండిరి గంధర్వభామలెవరొ.

హాహా! యనుచు ఘోషిలెడి యేటిఁ బాఱఁజూడ
చూపుదగులవు వాలయిసుక పడవలు
గాని, తెల్లపూఁబొన్నలఁగాని, మునుఁగ
నట్టి గట్టుల నలుపుచిహ్నములుగాని.

చాకిరేవునఁ గాలెడు శవమొకండు
మినుకులాడు దీపముతోడఁ జనుచునున్న
నావ యొకఁడుమాత్రము దోఁచె నాకుముందు
హృదయ మేదోకలస్ఫూర్తి ముడిగితిమయ్యె.

అపుడు చప్పుడు గాకుండ నడుగులిడుచు
నెవరొ నడయాడు సరిసన్న లేగుదెంచె

తోఁటకి యాలవాలసమములయి తోఁచు నూర్పు
కెమ్మొరలఁబట్టి వలఁగొనెఁ గమ్మదనము—

స్ఫుటముగాఁ గానరాని యాభోగసురూపు
ఎటుచనుచున్న యనుమానమెత్తినాఁడ
నదభిముఖుఁడఁగా నూరించె నదియు నన్ను
సంవృతంబైన కవి కావ్యశైలి వోలె.

ఎవ్వరీ చిన్నచిన్నటి నేకతమునఁ
గాపువారని యడిగితి ముందు నేను
ఎడతెగని వేణుగానముం దడఁగెఁ గొంత
నాముకుఁతస్వరంబు పిన్నాణముగను.

ప్రకృతిసాక్షిగఁ బల్లెత్తి పలుకలేదు
తన యుదంత మావంతేవి చనుపెనఁగ
పరిచయము లేనివారల వరుసలేడ
వలపు వాడల ననిమైనఁ దెలుపలేదు.

మేలిపూదండయొకటి నామెడనపైచెఁ
జుట్టుచెంగావిచీర యంచులుబిగించి
పిఱుఁదు లసియాడఁగట్టిన వెలదియోర్తు
భ్రాంతిమానసవీచికల్ అంపిలంగ.

మగువహస్తమ్ములోఁ దనమస్తకమును
నాభుజస్కంధమునందు నానఁగఁ దవిల్చి,

చేరడేసికన్నులనిండ ధారగట్ట
విడిచె నశ్రులు పయ్యెద తడియుచుండ.

పద్మముఖినోటి తాంబూల పరిమళంబు
తరుణమగుపాణి మంచిగందంపుఁబూఁత
ఫాలతలినున్న కస్తూరివాసనలును
నాదుహృదయ మాకర్షింపలేదు మొదల.

సగముతడిసినపైటయు, సగమువ్రాలి
యున్న కనురెప్పలను, సగ ముడుకురక్తి
మనసు సగము, సిగ్గు సగముఁ బెనఁగులాడు
నాయమ యవస్థలే సగమాయె నాకు.

వింతపై వింత మంచుగప్పినవితాన
ననుజెనకి యాక్రమించెఁ గృష్ణాతటాన,
అకట! యేటియానంద భిక్షాటనంబొ!
మోహనములైన సంకేతభూములందు.

ముదితపెదవి సిగారింప ముత్యమంత
మాటలాడనికొంత యారాటపెట్ట
పైటదడుపు కన్నీళ్లతోఁ బాటు నాదు
మనసుఁదడిపె ననేకభావనలు నపుడు.

కాంక్షలే నిన్ను విడచెనో కలికి! లేక
నీవె కాంక్షల విడనాడినావొ తెలుపు;

మీ నిశీథ తారలతోడు! కృష్ణతోడు!
చెడ్డయొట్టున్న దిఁక మీద జెప్పవేని;

అనుచు దూరమునను వినవచ్చివినగాని
యెలుఁగుఁబెట్టియూరకోఁ బలుకరించి
యూరకుంటినంత, నొకకొంత సేపటి
కబల యిట్టులనియె నమృతవాణి!

II

ఓర్వలేనివారెవ్వరో యొకరినొకరు
పోల్చుకొనకుండఁ గ్రిందకువాల్చినారు
నీవు నాకును నడుమ నీ నీలితెరలు
సెజ్జపయి ప్రణయులమధ్య లజ్జలాగు

ఎవతెవనుచు నన్నడిగితి వీవు ముందు?
ఎవఁడవని నిన్ను నడుగరాదేల యిపుడు?
సందియమ్మందితోటు నాయందె రవళి?
ఏల నీవాలకము సంశయింపరాదు?

ఎవతెనని స్పష్టముగ వచియింపఁగలనో?
అనువుగాఁగన్నవారింటి యాఁడుఁబడుచు
నీడుగాఁ గొన్నవారింటి తోడికోడ
లిని, గ్రహింపు మిందెవతెనో! మనసులోన.

ఒకనికిఁ గుమారితను, మఱియొకని కాలి
నింక నొకనికి తల్లిని యిందులోన

నెవ్వరితనా? భావింపుము హృదయమందు
వానివరుసలు జ్ఞానసంభవము లేని?

నన్నుగని వారవైచి ప్రాణములువిడచె
ననఁటిచంద్రాన మాయమ్మ, యప్పుడాది
పెంచిరి ఆచేతులంబెట్టి పిన్ని మొదలు
గాగ నా స్వజనంబులు కాంక్షతోడ.

వెన్నతోడ వండిన ధవళాన్నములను
ఎండ బడి భుజించుటే యెఱుగ నెపుడు;
పూఁతెనెలుఁగుల తలయంట్లు బోసికొనక
శుక్రవార ముఖమ్ములే చూడలేదు.

ఆకుమఱుగు పుష్పముపోల్కి నందముగను
నన్ను పెంచుచునుండిరైనను మదీయ
తరుణసౌందర్యరేఖలే యిఱుగుపొరుగు
ఆడిపోతల కాకరమాయె నోయి!

చదువుఁజెప్పెను నాకొక నాటియింటి
చిన్నవాఁడు నేరుపులు పుష్పించు భాతి,
వలపడియెఁ గొంతిచక్కని యన్వయంపు
పాటవమును నలంకారపరిచయమును.

అందమయిన పద్యంబుల నల్లునపుడు
ననుపుఁబోగుల పట్టు నేసిన విధాన

పాడఁగలఁడు తియ్యని యష్టపదుల నెల్ల
సందెలందుఁ గల కల కషాయఘణితి.

పాడుచుందు నే నాతఁడు పాడినట్లు,
చదువుచుందు నే నాతఁడు చదివినట్లు,
ఇరువురముఁగూడి యొక్కప్పు డేకకంఠ
సరణిమై నాలపించు ముచ్చటలుఁగలవు!

తేటలారెడు శుక్ల చంద్రికలనూద్రి
మా వయసుతోడఁ జెలిమియుఁ దీవరత్తె,
యూరివారల దృష్టులు గోరగింప
నాల్క లపవాదరచనంబుఁ జిల్కరింప.

కొమ్మకొన నందగించిన క్రొత్తపువ్వు
ఎంతటెందఱి కెన్నెన్ని చందములను
భిన్నభిన్నాశయములు మొల్పించు నప్పుర!
ఐక్యగతియె ద్వైతాద్వైత మైనరీతి.

కావ్యకలలసింగారించు కవులమనసు
నళిమధువుఁబోలె నాసింతు ననవరతము
నవరససుధాకణాస్వాదనమును మరగి
తనివియే యెఱుంగము స్తనంధయములట్లు.

చదివినకొలంది నాకెన్నొల నుదయమయ్యె
భావములు స్వాతిముత్యాలకోవలటుల

బాల్య సంలగ్నమైన ప్రపంచరక్తి
పాలువిడిచినగతియయ్యె బడుచువాఁడ!

### III

పగలురేలిట్లు దిన మొకయుగముగాఁగఁ
గడుచుచుండఁ గొండొక ప్రొద్దుపొడుపు వేళ
బిచ్చమునకయి బైరాగిపిల్లయొక తె
వచ్చెఁ బాడుచు గోయిలల్ మచ్చరింప.

మాసిన మొగాన చెక్కిళ్లమవ్వ మొలయు,
పచ్చతంగేటి పూరేకువంటి మేని
పసిమి మురికిపేలికలలో వాడుచుండె;
ధూళిమునిఁగిన బంగారుతునుకఁబోలె.

ముదిత యింతంతవాల్గనుల్ బెదరిబెదరి
యెంతవరకుఁ గటాక్షించె నంతవరకు
నల్లకలువపూవులతోరణములు నిండె
పెండ్లివాకిళ్ల చందాన వింతభంగి.

అబల యీలుగులుదీసిన యమృతసరసి
సరణిఁ గలకంఠ మెత్తి మూర్ఛనలునింపె,
నెన్నివిసరులు విసరె నాకన్నెపాట
నన్నివిసరులఁ బారవశ్యములె గురిసె.

పూరిగుడిసెముందట దేవపారిజాత
సాల మతిపరిమళములు జల్లుకరణి,

ఎక్కడఘటిల్లెనో యెల్లచక్కదనము
లా దరిద్రకుమారి మోహనపువాణి.

కడుపునిండఁ గమ్మని యన్నకబళములకు
నోచుకొనని యాకన్నె కే నోములిచ్చె,
రాలుగరగించు గంధర్వలాలనమ్ము
జన్మవాసనలెంత నైజములో జగతి.

మలినవసనమ్ముఁగట్టిన మలిన తనువు,
మలిన భిక్షాన్నములుదిన్న మలినవాణి,
నెట్టు లాసించె నౌరౌర! యింపుగులుకు
అఖిల కిన్నరీదుర్లభ మయిన గీతి.

తీవ లెగలాగి దిగలాగి తీవరించు
వైణికులకుఁ జిరంతనాభ్యాసపటిమ
స్వరము లనుబ్రస్తరించెడు పాటకులకు
అమృతసదృశమ్మయిన గీతి యబ్బదేమొ!

మొగము నవనీతమృదులమై యెగయుచెలికి
మనసు నవనీత మయియుండ దనుటనిజమొ!
వనలతలకును నుద్యానవనలతలకు
భేద మరసినకవి యెంత వేత్తయగునొ!

గాత్రమెత్తి యా బైరాగి కన్నె యట్లు
పాడుచుండెను, వాకిండ్లవాడలెల్ల

చిత్తరువులతోఁ రాణించు చెలువుదోఁచె
ఎచటివా రచ్పటనె చలియింపకుంట.

వీథి వీథులఁ బొరలె నాబిడ విలాస
రాగలాలిత గానతరంగ భరము
చెలి తమలపాకు తీవ పాదులకుఁ బాఱు
ధవళజలకుల్యభాతి నార్ద్రంపుగతుల.

ఆమె పాడిన పాటల నాలకించి
అందుముకుళించియున్న భావార్థమెంచి
ఒకవిధంబైన యున్మాదచకితదశల
కగ్గమైతి మే మిరువుర మద్భుతముగ.

IV పాట.

పున్నమజాబిలి! ఓభామా!
పూచినసుఖరాత్రి నోభామా!
నెవ్వగతారలు! ఓభామా!
నిదురఁబోవనివేళ నోభామా!

పవనునిలాలన శోభామా!
పువ్వులు వేచెడి సందె నోభామా!
మొగలిపూరేకులు ఓభామా!
మొగము లెత్తెడివేళ నోభామా!

నీమీఁదమోహము నోభామా!
    నిలిపి యోపఁగలేక ఓభామా!
వెన్నెలలే తెంచు ఓభామా!
    సన్న త్రోవలుబట్టి యోభామా!

తీయనిగీతము లోభామా!
    తీసిన తెన్నుల నోభామా!
సొగసు ప్రేమపుదీప మోభామా!
    చూపినజాడల నోభామా!

భావోత్తేకయము నోభామా!
    పఱచివేసినదారి నోభామా!
ఎవరునుగనకుండ నోభామా!
    యేకాకినై లేచి యోభామా!

కాళ్ళునొప్పులుపుట్ట నోభామా!
    కడువడివచ్చితి నోభామా!
నీమేలివడకిల్లు ఓభామా!
    ప్రేమతో వెదకితి నోభామా!

వేసినవాకిండ్లు ఓభామా!
    పీడఁగఁదట్టితి నోభామా!
సుఖశయనంబున నోభామా!
    సోలిన సుప్తిని నోభామా!

కాటుక రెప్పలు ఓభామా!
కబళింపనీవుంటి వో భామా!
మీటిపకిస్తేక ఓభామా!
పాటనావంగలేవు ఓభామా!

ఏబంగరుకల లోభామా!
నీవుంటివో యప్పుడో భామా!
కనురెప్పలైనను ఓభామా!
కదలలేదే యప్పుడో భామా!

బొటనవ్రేలయినను ఓభామా!
చిటుకనలేదప్పుడో భామా!
ఆపరవశదశ లోభామా!
యెదలింపరాదని గోభామా!

అడుగుకదలకుండ నోభామా!
ఆపలవచ్చితి నోభామా!
నీప్రేమయూరాట మోభామా!
నీకొప్పగించితి నోభామా!

సందెరంగులబూయు నోభామా!
యందపువాకిండ్ల నోభామా!
స్వరమధుధారలు ఓభామా!
జల్లులాజనిచోట నోభామా!

ఆనందసూత్రము లో భామా!
అల్లు తెల్లని పైట నో భామా!
నా యాటపట్టువై యో భామా!
నను పున్న రమ్మాట కో భామా!

V

సీ. అలిగెను వలచినప్రేయసి యన్యయనుచు
నేను వలచిన వన్నెలాడి తెలుపఁడనుచు
నేఁడు వేఁడైన మంటట, చారుజలద
గర్భమును వదలిన జలకణములట్లు॥

సీ. ప్రేమపుష్పమ్మునైఁ గొంతుఁబెట్టి మనసు
లుత్కటమ్మగు విరహాన నుడికి కమలఁ
జెలిపోతిమి ప్రేమవలఁ జెరవిలీన
మధురమైత్రి శరిన్నేహమాలగాఁగ॥

సీ. అందమైనచందములఁ బ్రియమ్ములయిన
యాటపాటల భక్తిలీలానురతుల,
ప్రియుని సుఖశోభనమ్ముఁ గోరితిని నేను
సరసములఁ బ్రియుఁబొందు చైత్రిచాయ.

సీ. కర్కశములగు నియతులఁ గష్టమయిన
జపతపంబుల, నిష్ఠాప్రచారగతుల,
ప్రియసమాగమపుణ్య మర్థించె నతఁడు
భీష్మతపన రోహిణిఁబొందు గ్రీష్మునట్లు.

గీ. ప్రొద్దుపొడుపులఁ గమ్మని పూలజతల,
సంజెవేళలఁ జల్లని చందనముల
నిశల మధురవీణాలాలనీయరుచుల
నదిమొదల్ ప్రియుఁ గాంక్షించి వెదకుచుంటి.

గీ. పైరదిరిగి కళ్యాణపు పాటఁబాడు
పచ్చివాశిని బతిమాలి భంగపడితి,
"ముందుముం"దని వినఁబడ్డ మోహనోక్తి
సూత్రములులాగినట్టు లంచులను నడచి.

గీ. సంకెలలు త్రెంచి పోదుఁ బూసంకెలలను
బ్రియుని బంధింపవలెనంచు పిన్నవాఁడ !
నాకు సహకారివగుచు నీనావ నిచ్చి
కృష్ణ దాటింపు, మవల సుఖింపనగును.

గీ. నావ నడియేట నర్తించె నటివిధాన,
నిష్క్రమించిరి పాత్రల నియతివారు,
అలలచేతఁ బాడించెఁ బాటలను బ్రకృతి
యపుడు నిమ్మకు నీరెత్తి నట్టులుండె.

# కోయిల

ప్రమదరసాలసోదయాతరంగములన్ దగిలించి, పారవ
శ్యమునను మూలలూపెద వయారె! జగంబులఁ జేతన ప్రపం
చము బహిరంతరస్ఖలనసంగతి మాని ప్రశాంతమయ్యె, నే
త్రములకుఁ గానరావు మధురంబుగఁ బాడెద వెందొ! కోయిలా!

గీ. శాంతిసాగరమగ్నమౌ జగతియందుఁ
దాపకీన సరసఘోషయే వినంబ
డెను, నడికిఁ జేయిగుజ్జు కారడవి కెలన
వినుచు నెలపోన బింబిలధ్వనులఁ బోలి.

గీ. మాదు సుకృతంబువలన నీ మధురసూక్తు
లింత వినఁబడు కాక దవ్వింతయున్న
నిస్తరంగానిలాబ్ధి సంధించి యాఁగి
పోక, పఱతెంచుటెట్లు నీపోక లిటకు.

గీ. చదలనుండి చల్లనగు తుషారకణము
లురులునట్టుల హాయిగా కురియు నీదు
కలకల కషాయమాధురీ విలసన లలి
తపద జీవనంబయిన గీతంబునందు.

చం. పిలపిలమంచుమంచుగురిపించెడి వేగునలేచి చిన్ని గం మం
టలు మొడలందు ఫుల్లని స్ఫుటంబుగ మ్రోయఁగ మేయుగొత్తె
దల నరికాచు గొల్లనియుదారపు టీలలలోఁ బ్రతిధ్వనుల్
మొలవఁగఁ జేసి మైమఱపు ముంపులముంచెదు నీదు పాటలన్.

గీ. కిన్నెర లోయార మదరఁ బల్కించు మించు
బోఁగులదె యపస్మార నిద్రాణమాగుచుఁ
బలుకు బడియింపు, సన్నంపు వెలుఁగుకళుకు
మృదు లతాగతి మెఱుఁగ కానుదురు మూర్ఛ.

చం. ధవలచిరత్నరత్న రచితంబగు సౌధము నగ్రమందుఁ బూ
సవరపు సెజ్జపై వలపునన్ దన వీణియ మేళగించి, మో
హావశమాగఁ బ్రపంచమును నాకుల నెట్టు నోయారవోలె నీ
భువనములెల్ల నాదమయముం బొనరించెదవౌర! కోయిలా!

గీ. ఘోరలు పశులని బిగువు పూవిరులసరణి
బాలభాషలపగిది నవ్యక్త మాధు
రీధురీణసారళ్య సంత్రాణభరము
గ్రుమ్మరించెదు నీగీతి కోకిలంబ!

చం. రతనపుముక్కలట్లు రుచిరంబగు పల్కులఁబొందచంద మం
చితముగ నేర్చికూర్చి విరచించెదు నీమృదుగీతి, నింతయున్
యతనపుఁ బాటవంబును బయల్పడనీవు పికంబ, నీదు గు
ప్తైతనయగారవుంగయిత విశ్వము మూర్ఛలఁజేయు టబ్రమే!

చం. చినుకులుచిన్కులై మధువుసిందెదునట్లు లలంతియాంతలా
తునుకనుడుల్ జతించి, కలదో! మతిలేదో! రసంబో! భావమో
యని మెదియెద్దియోంచుఁ గవులబ్బులు సాచఁగ మబ్బునీడ డా
గిన నెలరేకసోకు లాలికించెదు నీకవనానఁ గోయిలా!

గీ. మఱచిపోయిన యేకవిమణి సజీవ
గీతికలు చూచు విన్చెదవో తలంప
శాంతిమెఱుఁగని యీ మనుసంతతులకుఁ
దెలియఁ బడదింతయుఁ దదర్థముల తెరంగు.

గీ. తెగులపుందీపియును, బిడ్డ మొగము నెడలఁ
దెగనికాంక్షయు, స్వార్థవృత్తినిరతియుఁ ద్య
జించి, తన దేశమాత సేవించు వీరు
నెవని మఱచితిమో వచింతువు పికంబ!

గీ. నిందుకవుగీష్ట కెడఁబడి మందు విరహ
మునఁ దపించెడి యే ప్రవాసినులఁగాంచి
మెత్తనగు గుండె జాలిరేకెత్తవచ్చి
తెలుపుదువో నాయికాదేశములను పికము!

చం. అకట! నిషాద! చేతు లెటులాడుఁగదోయి! యభేద మోహకా
తుకమున మైజతుల్ మఱచి తూలక పోతము నేయఁగా! వధిం
పదు వధియింపకంచు పికమా! యనుకంప తొలంక సాశ్రుగీ
తికలను వేసుకొందో! కలదే! తెలియంగ భవద్విచారముల్.

ఉ. మా త్రైపుటశ్రువుల్ నయనముల్ డిగజాఱఁగ మాటరాని డ
గ్గుత్తికతో డసంపకపు గూతుఁ గవుంగిటఁ బాయలేని యే
మెత్తనితల్లికన్న చెలిమిన్ మధురంబుగఁ గీరితింతువో
క్రొత్తయిగుళ్ళమేపడ! యెఱుంగముగా! భవదీయబోధలన్.

గీ. ప్రణయగాథయొ? దారుణ రణకథాక
థనమొ? లేక సందేశ గాయనకళా క
లాపమో! తేటఁబడదు నీ లలితగీతి
చంచలతనూఁగు మర్త్యప్రపంచమునకు.

గీ. పలు తెఱంగు, లనేక భావములు, భిన్న
రుచులు, కలయూనికళలు రేఁగుచుఁ జలించు
విశ్వమిదె విశ్రమించి నీ విమలబోధ
విని యెడని తదర్థ మెఱింగికొనెదు నాస్థ.

గీ. పవలు తేలును నాకమవ్వంపు చెలుల
కౌఁగిళులఁ జొక్కి సోలెడు కాముకులకు
బోధపడదింతయును నీదు మోహనోక్తి
సొలపులను మాన్ప కలఁజడిఁ గొలుపుగాని.

గీ. తర్కముల బోధగాక, సూత్రముల విడన
భాష్యమీమాంసములఁ దేటపడని, తాత్త్వి
కులరహస్యములెటు తీర్పఁగలవో పికమ!
ఆలకింపనున్నారు వేదాంతు లదిగో!

గీ. “కో”యనెడు నీదు మేల్కొల్పు హాయి కలరి
మెలుఁగులిచ్చు పుల్గుల కలకలము వినెదొ!
స్వకుల సందేశమును వాదుపలిపి, యన్వ
యించు నీగీతి నెటు సమర్థించుకొందు?

గీ. సెలవి నురువులతోడఁ బచ్చికలు రాల
నిలువఁబడు మోములను సాచి నెమరు మఱచి
పాడియావులు నీముద్దు పాటవినుచు
నెదియొ పరమార్థమందుల నొందవుననుచు.

చం. పసితనమందు నుయ్యెలలపై నను బొత్తుల పండఁ బెట్టి పో
రుసడల మాదుతల్లు లలరుంగతి నేమృదుగీతపాడిరో
యసలది విస్మృతంబుగ నెనప్పుడె మాయెడ; నిల్చియుండె నీ
దుసుకృతి లేకయున్నఁ గలదో? కలమాధురి యింతనీరుతిన్.

ఉ. పెండ్లికుమారుఁడై చిగురువిందులకేగు వసంతు రాక నిం
డ్లిండ్లకుఁబోయి తెల్పెదు పయింబయి కొమ్మలనంటికన్నె పూఁ
బోండ్లకు రాయబారములొ మోహబుతూదయొ పూతగీతమో?
పండ్లను జెండ్లనుఁగా బసపువారెడు పూవుల నోముపాటలో.

గీ. పూలపూజలు సలిపిన మోహనుఁడు వ
సంతుఁ డాతని రాక నీవింత చాట
నేల, కేవల నాంది కాఁజాలదిదియు
చాల పరమార్థమెదొ తెల్పఁబోలు పికమ!

చం. మెలమెలఁ బాఱు కాలువ సమీపమునన్ గడుమెత్తనైన శా
ద్వలమున పయిన్ శయించి, మమతంబొలివోని ప్రియాను [రాగ ని
ర్మలమది రాంతపాల సభరంబునఁదూగు కురంగదంపతుల్
సెలిమి వినంగఁబాడుము ఫలించును నీశ్రమమెల్ల! కోకిలా!

కం. పలికించినదారువుల రు
తులకుఁ జెవులు కోసికొను నధోగతులకు సి
గ్గాలయఁగఁ గలకంఠమ! నీ
కలకంఠ రవామృత మొలుకం బాడెదవో!

గీ. పిదుకు వెన్నెలపాలు శ్రీ మొదవు కమ్మ
కప్పురంబిచ్చుననఁట చిక్కని మరంద
మొలుకుఁ బూగుత్తి కడుపునఁ దెలియరాదు
నైజభిన్నత సృష్టి సంతానమందు.

గీ. పవనమును దిశోత్యాగించి మార్దవముఁ బెంచి
నవనవంబగు రసము నొలవరచించి
చిత్రికులకును గవుల కుత్సవమును ల
గించు కోకిలా! నీపూర్తి గీతఫలము.

చం. మినమినలాడు క్రొన్నురుగు మీఁగడ తెప్పలు తేలుచుండఁ
గొండ నెనసి పాఱు కాలువ కెడాపెడ మొల్చిన చెట్లగుంపులో
వినఁబడు "గింగురుల్" సెవులపీడ యొనర్పక మున్న నీమృదు
స్వనమును వెల్లిగొల్పి కవిసంతతులన్ గరుణింపు కోయిలా!

గీ. చెలిమి మానుడు లాలకించినను సరియె
విప్పి నీభావములను జెప్పినను సరియె
కాకయుండిన ఫలమేమి కోకిలంబ!
త్వదుపదిష్ట గీతామహాహ్లాదయమువలన.

ఉ. ఇంపగునీదువాణి నుదయించెడి యొక్కొకమాట యొక్క ప్రా
ణంపుసుధాకణంబయి మనంబుల నువ్విళులూరఁజేయు మో
హంపుభరంబుఁదీర్పక ప్రియంపు తలంపెటిఁగింప, కింకశాం
తింపులజోలలేల వినుతింపుల లీలలవేల! కోయిలా!

చం. వినఁబడలేదు కృష్ణు వలపింపుల పిల్లన గ్రోవిపాట లిం
కను, జనియింపలేదు కలికాలమునం దల రాధలెందుఁ, జ
ల్లని యమునానదీజలములన్ మెడలెత్తుక నీదులాడ వా
వులు నిఁక నేటిగానములుపో! తలపెట్టఁగమాకుఁ గోకిలా!

గీ. నవరసంబులు పోషించినారు కవులు
నవరసంబులు నీపోషణమున నడరు
తన్మయానందమధురి మోదయుభరంబు
గడురు నీగతి నేమి పల్కుదును పికము!

గీ. దివ్యసందేశమనుచు సందియముకొంత
కలకలాగీతియను కలకలము కొంత
నైజకంఠస్వరంబను మోజుకొంత
కలిపి కలఁచెదుసుమ్ము పాటల పికంబ!

గీ. వినువక యనేకవత్సరాల్ కొనరి కొనరి
ఋతువు దప్పక చాటినయేని నీదు
పాట కర్థంబుసుంతయుఁ దేటపడదు
అటులగుటఁ దావకాదేశ పటుతరోక్తి
యధమ మానవతతికిఁ గాదని తలంతు.

# క న క ము

(ఒక స్వప్నము)

ఎంతం బురదంబడి యె
క్కండనె కాళ్ళీడ్చుకొనుచుఁ గడు సలసటతో
రెండామడ నడచితి తప
నుం డస్తాచలముఁ జేరను దరిసితిఁ బురిన్.

గీ. పెరుగు నన్నంబు సాపడి ప్రియములాడి
తూఁగులాడెడి నిద్దుర నాఁగలేక
పవ్వళించితినొక్క తల్పంబునందు
ఎచటికోపోయెఁ బ్రాణంబు లింతలోనె.

గీ. కోడి కూయుచునుండెఁ 'గోకో' యటంచు
అపుడు మెలకువగదిరె 'ముద్దాడుచున్న
సొగసుపిట్ట' చివాలున నెగసిపోయి
నటుల నెద్దియొ విస్మృతి యానుకతన.

ఉ. నేను శయించియున్న రమణీయ నిశాంతమునందు, మెత్తనౌ
పానుపులందు నిద్దురలఁ బాయక యుండి రసుంగు చెల్లెలున్
జ్ఞానవతీశిరోమణి, ప్రసన్నగుణాదర నాదుపిన్నియున్
మేనఁ గెఱుంగకుండ నలమెన్ బెనుమైకము వారి నయ్యెడన్.

చ. పడమటిదిక్కునన్ ముసుఁగువాల్చక యుంచినజాలకంబునన్
సుడివడ స్రుక్కి యొక్క పసుచుంబులుఁగ య్యెడ దూఁటివచ్చి, డా

కడ తెలి మద్దుగుజ్జుపయిఁ గాళుల నానిచినిల్చి, జంకెనల్
కడకనులం దొలంక, నయాగారమువస్థల యందుదోపఁగన్.

గీ. వలపు చిగిరించె నాముద్దు పులుఁగుకనులఁ
బడినయంతనె, 'యెటులేని పట్టుకొనెను
నాస యంకురమయ్యె నాయంతరమున'
కలదు నాకిట్టి నైజచాపలముకొంత.

గీ. నిదుర లేపితిఁ జిన్నిని, వదలెసుప్తి
చెల్లియును, వన్నెలొలికించు చిన్నిపులుఁగుఁ
గైకొనలఁ జూపితిని వారు కనులువిప్పి
నలచికొనుచును నలునిటుఁ గలయఁజూడ.

ఉ. ఆరతినాలపిట్టను సుపాయముగాఁ గడియించుకోలునన్
విూరలు తోడుకొండనుచు మెల్లన వారికిఁజెప్పి, జాలకో
దారపటంబులన్ దిగిచి, దగ్గరియున్, బెదపోయియున్, గడల్
దూటియు, వంచిపొంచి, యెటులో! కయిసాదిపులుంగుఁబట్టితిన్.

గీ. మిసమిసల పుట్ట, మవ్వంపుఁ బసలగుట్ట
సొగసు రతినాలతిట్ట, సోయగపుకట్ట
ప్రియములకుమెట్ట, యీ మురిపెంపుపిట్ట
చెలువములపట్ట మేమని పలుకవచ్చు.

గీ. పసుపుచాయను కలదు ఱెక్కకొసలయందు
కదలు పున్నాగ పత్త్రరేఖలనుబోలి,

పద్మదళఖండ మనఁగ పాటియగుత
నలుపుమచ్చయొకండు సొంపొలయుచుండె.

ఉ. మెత్తని పట్టుకుచ్చు కలిమింగయికోకయె పూలగుత్తి నా
యుత్తరుణంపుఁ బుల్గు కడువచ్చపు పొందికతో నెసంగు కెం
పెత్తిన దొండపండనఁగ నింపగు దిద్దిన కోలముక్కు, ఆ
ముత్తెమువంటి పిట్ట పొలుపుం జెలువుం దరమే వచింపఁగన్.

కం. కోనగోరులు నునుపయి వం
గిన మావిచిగుళ్ల పగిదిఁ గెంపెసఁగియు వాఁ
డిని నతినిశితములై పొలి
చినగతిఁ గనుపట్టెఁ గోలఁదిచిలుక లగుచున్.

గీ. నడల కులుకు బెడంగు, అందంపు మెడను
పెడకుఁ ద్రిప్పుచు తెక్కులాడ్చెడి సొబంగు
కళుకుఁ దులకించు నొడలి యొప్పుల తెఱంగు
కలదు కందెందు లేని ఆకనకమందె.

చ. అలతలువాయ ~, జడుపులాటఁ, బ్రియంబునదువ్వుచున్ గరం
బుల ననుకూల పంజరముపోలికఁ జేసి, వినోదభార వి
హ్వలమతినయ్యనెయ్యమొలయంగను బ్రాణములొక్కయెత్తుగా
వలపునఁ జూచుచుంటి బలవంతముమానివిహంగరత్నమున్.

గీ. పెనఁగులాడుచుఁ గొంత, మ్రాగనులు వెట్టి
కదలకయ నిల్చి గొంత, చక్కని నఖాగ్ర

ముల నెఱకలు గోకుచుఁ గొంత, కలఁగి జివ్వన
నెగసియెగసియూసు గొంతనటనఁజూపె.

చ. ఇటులొకకొంతయాటలపయిన్ మమతంగనకంబుతోఁ బెనం
గుటఁగనులారఁగాఁ గని యిగుళ్ళయెడం దనుజాలి మోన తె
త్తుట వచియించె పిన్ని! కలదో? సుకుమారమణీ! వినోదలం
పటమతివైపులుంగునకు బాములువన్నియు,వింతసూచుటల్.

కం. ఒడలెల్లఁ జెమటలెత్తఁగఁ
గడు శ్రమముంబడితి వేమి కనకము గలదీ
(కడగండ్లమారిపులుఁగున
కుడిచినఁ గూస్పుండఁ బోవు కొంచెము కుత్రా!

కం. వదలఁడగు నీవులుంగును
సదయుఁడవై యాట పాట సయ్యాటలకీ
మృదులద్విజమోపము, పం
పెదుగాకల యొత్తవారి పిల్లనుబోలెన్.

కం. అని యాడువారి మెత్తని
గొనముల నారళ్ళ మలమికొనఁ బలికిన నా
పినతల్లి మాటలను జెవు
లను బెట్టక యిట్టులంటి లాలితఫణితిన్.

శా. పిన్నీ! పుల్గును బట్టరాదనుచు నేవేదాంతమోచెప్పి న
న్నున్నొప్పించితి వింతదాక,యెటులూనున్ డెందమానందశాం

తిన్నిత్యంబుగ? నిశ్చల ప్రియపదముల్ నిండారు విజ్ఞాన సం
పన్నుం డెంచుఁ గృతార్థుఁ డంచు మునుఋషుల్ పల్కంగ నాలింపవో.

ఉ. డెందము కందళించిన సుడిబండసీక విశారదనైజ మా
త్మం దోలఁగించి, భావసుకుమారత కందళయుండ, నిర్భరా
నంద మరంద మొల్కు.. సుమనస్సరసీజములం బ్రమోదతృ
ష్ణం దనియించుచుందు రను జ్ఞానులవృత్తము లాలకింపవో.

శా. తల్లీ! ప్రాణికి నైజతృష్ణలగు సాంద్రంబైన యానందవాం
ఛల్లీలాదృతిఁ గాని చల్లఁబడ, వుత్సాహ ప్రవాహంబునన్
గల్లోలంబగు నింద్రియాంబులు తదేకధ్యాన విన్యస్త భా
వోల్లాసంబును గూర్చు, శాంతిపనవోయుం బిమ్మటం బెల్లుగన్.

మ. అవనీమోహనమైనయీపులుఁగుమైయందంబు నానందమున్
మివులన్ జూచియుఁ గేలనూచియు శ్రవోలీలోత్సవంబైనమం
జువచో ధోరణి నాలకించియు, హసించున్ నామ సోవల్లి, ప
ల్లవమై, కోరకమై, ప్రసూనమయిలీలాగుచ్ఛమై స్వేచ్ఛగన్.

మ. నునుపుల్ దేఱు మెఱుంగుతెక్కలను నిండుంగౌగిటం బట్టియె
త్తినయుత్సాహము, సోయగంపుమెడవాల్ త్రిప్పుల్లుగాంక్షిం [చిచూ
చినయుల్లాసము ప్రాయపుంబహాయలమైసింగారమీక్షింపఁ బం
చిన సంతోసము చెప్పఁగా నలవియే! పిన్నీ! విచారింపఁగన్

కం. గరువపు నడలబెడంగును
మురిపెపు బంగారు పక్షముల యందంబుఁ
సురుచిర తారుణ్యాంకిత
తరళంబగు పులుఁగు సొగసుఁదనమును కంటే!

కం. అఱమోడ్పు వెట్టి తెలికను
లరుణిమదలమెక్క జెక్కుయంచుల స్వేదాం
కురములు దొరయ నొయారపు
సరణి ననుభవింప వలపు సాలదు పిన్నీ!

ఉ. కాటుక రేఁక పొందికలఁ గానఁగవచ్చెడు గుత్తపుమ్మొదల్
బాటలుతీసె మచ్చలను, బాగుగఁదీరిచి దిద్దివెట్టె నా
లాటిక చంద్రఖండము విలాసము, నాసలుదీఱఁజూచి యీ
నీటుపులుంగుఁ బోవిడువ నేరదు నా మమకార మమ్మరో!

సీ. పలుక లేదింక 'రవ్వలురువ్వు' గలమెత్తి
జిలిబిలి పలుకు ముద్దులు నటింప
చిలుక లేదింక, చెప్పలలోనఁ జిగురెత్తు
నగవు వెన్నెలవన్నె సొగసులెసఁగ
మెలఁగ లేదింకఁ గోమలపదంబులు గుల్క
నడక పొందికలయందములు నెలుఁగ
చెలఁగ లేదింక నాటలయాలంతెలువాసి
చనవు మాలిమి తీపిఁ ననువుపడఁగ

గీ. తనివి లేదింక ముద్దాడికొన ప్రియంబు
తీఱ లేదింకఁ బట్టినకోరికయును
వదలు వదలు మటంచుఁ బల్కెదవు పిన్న
ఎటుల నెడఁబాయఁజాలుదు నింతలోనె.

క. అనియిటు లెసురాడెడు నను
విని, యనునయ మొలుకఁ బలికెఁ బిన్నియు మఱలన్
కనికారపు శివచినుకులు
కనుఁగొలకుల నిండి తొలఁకఁ గద్గదికోక్తిన్.

శా. నా ప్రాణమ్ములు తల్లడిల్లెడిని డెందం బాకులంబయ్యెఁ గ్రీ
డాంతుండవుగాక యూపులుఁగుబిడ్డన్ వేపెదెందాక, తం
డ్రీ! ప్రేమామృతమొల్కు చూపులను దీనిం జూచిపోనిమ్ము, బా
ల ప్రాణమ్మును బాయుమిన్ గనులు తేలన్ నైచె నాలింతలన్.

క. తలవాంచి యుపంచెలు సూ
పులఁ గనఁబడ ఖిన్నభావమునఁ గడలదు నీ
పులుఁగుఁ జిన్నది, నలపిం
పులఁ దగిలిన నీదు మనము పొందదు తన్విన్.

క. పసికూనల విసివించిన
ఉసురు మహాఘోరముగుఁ గదోయి కుమారా!
వ్యసనంబులఁ దగిలితివి
మిసలపులుం గేలవచ్చె మిడిమేలముగన్?

శా. నేత్రాంతంబులు శోషవోయినగతిన్ స్విన్నంబులయ్యెన్, దయా
పాత్రంబీ తొలికాన్పు పిట్ట విడిపింపంబోలు నీపాటికో
పుత్రా! భూతదయాసుధామధురమై పుష్పించు నీచేత మే
మాత్రంబుం జలియింపకే తగిలె హింసారక్తి నింకేమనన్.

మ. ఎపుడో విన్నటులన్ స్మృతిం దగులునో యీ! నాయనా! చిన్నిప్రా
యపు రాచిల్కలఁ బట్టరాదనెడి న్యాయంబున్, విచారింపకీ
యపరాధంబున కేల పాలుబడెదీ యజ్ఞాది వేధోండ మా
యపరబ్రహ్మకళామయంబెగద ఛాయాభిన్నమైతోఁచినన్.

మ. కడుపుం దీపినో హాహా! కుమార! యని కేకల్ వెట్టవ్యాసుండు నె
క్కుడు వైరాగ్యమునూని, సర్వసముడై 'కోహ'మ్మటచున్ బరుం
గిడు నా శ్రీశుకుఁ జూచి చెట్టులను రక్తింబిల్చుచున్ దన్మయం
బడరన్ ధన్యములయ్యెనంచు మును నీవాలింపవో పుత్త్రుఁడా!

చం. గానములలోన భూతదయ కోమలమంచును నొక్కి పల్కి, చే
తనము సమస్తవస్తుగుణతత్త్వమునందును భిన్నకాంతులన్
బెనుపడియుండునంచు మురిపెంబుల గీతములన్ రచించి, మో
హనముగ బాడుచుందువది యంతయు నెందరిగెన్ గుమారుఁడా?

చం. అల నలచక్రవర్తి కలహంసము నాఁచిన యప్పుడామెకీ
తల వచనంబులన్ జదువ తల్లిరొ! బాలయినన్ గరంగు నం
చెలమి పఠించుచుందువది యెట్టుల మాసెను పుత్రి! యాటపా
టల మమకారమున్ విడ వెడందను బుద్ధికదెంత గల్గినన్.

మ. కొడుకా! చెప్పినమాటలన్ వినవు నీకుం దోఁచదేమందు, నీ
పడుచుంబుల్లను బట్టినంతటనె యేభాగ్యంబు నీకబ్బె నె
క్కుడు ముద్దాడి వినోదమారసితి సంకోచింపకే వీడుమా!
యడియాసంబడఁజూడఁగూడదట యేప్రాణంబునేనిన్ భువిన్.

శా. వెన్నంబోలుగదోయి నీమనసు తీవెన్ వంచి పూల్గోయ లే
వెన్నండైనను బౌద్ధధర్మముల నేమేమో ప్రబోధింతు వీ
వన్నేఁజిన్ని పులుంగుఁబట్టికొని ముబ్బాముల్ వడంజేయఁగా
జన్నే? గాదిలిపుత్ర! చెడ్డపనులం జాలింపలేవే యిఁకన్.

గీ. పాలుగారెడు నీపిట్ట ప్రాయమైన
అలసి సొలసి యవస్థల లలిత లలిత
మగుచు గన్పట్టు వగచిన్నెలైనగాని
తరుణ కరుణాస్వభావ పాత్రములుగావో!

చం. కలనయినన్ వికారమును గానక, ప్రాణములెల్ల నీపయిన్
నిలిపి, తదేకనిశ్చలత నిండుమనంబున నిన్నుఁజూచుచున్
మెలఁగెడు పిన్నిమాట చెవినింపగదోయి కుమార! ఇంక నీ
పులుఁగునువీడి నామదికి మోదము శాంతముగొల్పుమియ్యెడన్.

కం. అని పరవశయై కరుణము
తొణకన్ వచియించెనామె, తోడ్తోడన నా
మన మెదియొ వికారపడన్
గనకంబును నెగిరిపోయెఁ గలలో నంతన్.

## స్వప్నశాంతి

మ. కలలో ముద్దులుసూపి యాఁకనక మేగన్ దాని నెయ్యంపు తీ
పుల కారాటమునంది కుందు హృదయంబున్ శాంతిసేయుందలం
పుల నస్మత్కవితాశుకిన్ బనిచితిన్ భూలోక మీక్షించి యెం
దుల నేనిన్ గనకంబు బిల్చికొనుచున్ దోఁతెంచునన్ భ్రాంతితోన్.

# ధ్యానిబుద్ధప్రతిమ

మ. బహుళాధ్యాత్మిక దివ్యసత్త్వసుషమావ్యాకీర్ణతన్ దృక్పయో
రుహపాళీద్వితయంబు యోగనియమారూఢస్థితిన్ మూసి; దు
స్సహబాహ్యస్ఖలిత ప్రపంచదురవస్థా దూరసంసిద్ధికై
యహహా! చూచెదెయాత్మబోధన నిరీక్షాపేక్ష శిక్షావిధిన్.

మ. బయలన్ గాంచిన(గాననయ్యెడు జరాభారవ్యథాదుస్సహా
ర్తియుతక్షోభలటంచు నెంచి పటువక్రీభూత దుష్కాలసం
చయ సంచార వికారమారసి, యపస్మారక్రివృయార్త్తి రో
సియె, నేత్రంబులుమూసితే! హృదయావంశీగాన మాలింపగన్.

మ. సమసెన్ బ్రాచ్యమహాత్త్వతత్త్వము, కళాచాతుర్యముల్
మాసె, వా
సె మహాధర్మయుత ప్రశస్తమతముల్, జీర్ణించెసౌందర్యభా
వము, క్షీణించె స్వధర్మగౌరవము, తీవ్రింబై పరాచారదా
స్యము రాణించెను భారతీయుల యవస్థన్ జూడలేనంచు నే
త్రములన్ మోడ్చిహృదంతరంగమున స్వారాజ్యంబుసీక్షించెదే!

మ. నటనంబాడెడు నెమ్మొగంబున చిదానంద ప్రభాలక్ష్మిసం
ఘటితధ్యానవిలాసమూర్తి హృదయాకాశంబునన్ వెల్గు ప్ర
స్ఫుటవిజ్ఞాన కళాంకురస్తబకితజ్యోతిః ప్రకాశంబు ము
చ్చటగా జూపెడు సాధుమాగ్ధ్యగుణగుచ్ఛవ్రాతమా! గౌతమా.

ఉ. ఆసలఁబోనడంచి విషయాదిశరీరసుఖంబులన్ నిరా
యాసమునన్ ద్యజించి పరమార్థమెఱుంగ మనంబలంచి, వి
శ్వాసమునించి సర్వసమభావము నెంచి, విశుద్ధతన్మయా
భ్యాసముఁ బెంచి, దివ్యపరమావధిఁ జూపెడునీదుమూర్తియున్.

—oo◆oo—

# కవిత

తేట లయిన పుణ్యారణ్య ♦ వాటికలను
బుట్టితి నుషఃకుమారి తోఁ ♦ బుట్టుగాఁగ

*     *     *     *

అంద మెగఁబోయు లావణ్య ♦ మాహరించి
తపసివం బసియాడు జీ ♦ వనము త్రావి
పెరిగితిని నిత్యకోమల ♦ స్ఫురణలడర
ఇగురుటాకు నెలల పచ్చి ♦ యెండలందు

*     *     *     *

గ్రీష్మమాసవేణికలఁ దే ♦ లినజలాల
స్నానమాడి శిరోజ గు ♦ చ్ఛములు కడిగి

*     *     *     *

నింగి బాలెంతనడికట్టు ♦ కొంగులనఁగ
జాలు నతసీపయోద ప్ర ♦ సన్నరేఖ
లందికొని లాగి చీరెగా ♦ నందగించి

*     *     *     *

క్షాళితవిశాల విశ్వరం ♦ గంబునందు
నిండువెన్నెల తెలిచాంది ♦ నీలుగట్టి
మొలక పచ్చని మ్రుగ్గులు ♦ పుడమిఁదీర్చి
శారదోత్సవ భోగమ్ము ♦ సలిపి దనిసి

పచ్చిముత్యాల వాయనాల్ ♦ పంచిపెట్టి
ఉదయసతి కాళ్ళఁబచ్చప ♦ య్యెదలుసాచి

*　　*　　*　　*

పత్త్రి వస్త్రాపహరణపా ♦ పంబుకతనఁ
జిన్నవోయిన కొమ్మల ♦ సిగలమీఁద
ఋతుహితస్నాన శోభన ♦ మెదుగ నరసి

*　　*　　*　　*

తడిసితడియని నాజూకు ♦ త్రాళ్ళవలల
భావశుకములు బందాలు ♦ పడ రచించి
ప్రాణిలోకమ్ము నానంద ♦ పథఖిలీన
మహా దనంతసౌందర్య సా ♦ మ్రాజ్యమునకుఁ
బెనువలపుఁగొన నారాట ♦ పెట్టుచుంటి,
చిక్కన శకుంతములకు న ♦ చిత్రమయిన
అమలవాగర్థకేళీర ♦ హాస్యమధువు
నామెతలుపెట్టి సాకితి ♦ ప్రేమవిరియ

*　　*　　*　　*

నాదుసౌందర్య విభవము, ♦ నాదు రేఖ,
నాదుకన్నె సింగారంబు, ♦ నాదుచేష్ట,
నాదునడకల సోడిమి, ♦ నాదుగీతి,
సుమధురంబైన పూజాప్ర ♦ సూనమట్లు
అస్ఖలితమైన కన్నె సో ♦ యగముచాయ
కనులఁబూజించి మనసుతో ♦ గారవించి

వాణిఁద్రావుచునుండి ర ♦ రీణాభక్తి
పరిపరివిధాల శోభా త ♦ పస్విజనులు

* * * *

బాలపుష్పము నంటిన ♦ పాపమనుచు,
ముగుదవలె రేఖఁ జెఱఁగుల ♦ మూసికొనిన
మధుర తారుణ్య మర్చనా ♦ మాత్రమనుచు,
అడుగుసోకినకడనెల్ల ♦ నణువులణువు
లగుచు ప్రాణకళలు రాలు ♦ నందమొంచి
కొలుచుచుండిరి భావవి ♦ హ్వాలులుమున్ను

* * * *

నిత్యకౌమార తరుణాభి ♦ జాత్యనగుచు
నింత స్పర్శాకలంకము ♦ నేనియెఱుఁగ.

# ఆచారక్షయము

౧

తీరు తీరుల నలం ♦ కారముల్ మ్రుగ్గులఁ
జిత్రించు మవ్వంపుఁ ♦ జేతిమేల్మి
పూసలతో బొమ్మ ♦ పోసిన యట్లు చ
క్కని కుట్టుపను లల్లు ♦ కౌశలంబు
కైవారములు లేక ♦ యే వలయము లష్ట
దళరేఖల నమర్చు ♦ కలికితనము
పాడేటి రాటాల ♦ పాలు డీసినరీతి
సన్నదారముఁ దీయు ♦ జాణతనము

గీ. తెనుఁగునాఁటి కులస్త్రీల ♦ దినదినంబు
సన్నసన్నగ నణఁగారి ♦ చచ్చుచున్న
వకట! ఈగృహాజీవ దీ ♦ పికలు నిలువ
స్నేహనిధికి భిక్షాటన ♦ సేయరేమొ!

౨

సీ. ఏడాది పొడుగున ♦ నింతతీరిక లేక
చేలలోఁ గష్టించు ♦ సేద్యకాండ్ర
పెద్దపురాణాల ♦ విన నోచుకొనక యూ
రికి దూరులగు దుర ♦ దృష్టజనుల

ఉప్పు కల్లుకుఁ గూడ ♦ నోడ లమ్మవలసిన
ఆధార శూన్యులౌ ♦ అనదవాండ్ర
ఇంటిబానినచాకి ♦ రే సర్వమని తూర్పు
పడమర లెఱుగని ♦ పల్లెసతుల
గీ. ఎవ్వడింక తాంబూర వా ♦ యించుకొనుచు
దరిసి సదువు పజాహ్లాద ♦ తంత్ర మెవుడు?
అన్నకాటక మటులుండ ♦ నావహించె
భూమి నానంద దుర్భిక్ష ♦ మును సఖుండ!

3

సీ. వినువారి కన్నీరు ♦ వినవాకగా బొంగ
సీతమ్మ కష్టాలు ♦ సెప్పిసెప్పి
వెఱ్ఱిగొల్లడు గూడ ♦ నుఱ్ఱూతలూగంగ
వీధిభాగవతాలు ♦ వేసివేసి
మునలివాండ్రును మీస ♦ ములు త్రిప్పి కాకేక్క
వీరబొబ్బిలికథల్ ♦ వినిచి వినిచి
ఆబాలగోపాల ♦ మావేశమున త్రుళ్ళ
పల్నాటియుద్ధాలు ♦ పాడిపాడి
గీ. పల్లెపల్లెల బ్రాణము ♦ పచ్చగిల్ల
జాతిసుఖము పోషించితి ♦ సర్వకాల
మెచ్చట సురింగిపోతివో ♦ బిచ్చకాఁడ
కవివి పాటకుఁడవు నీవె ♦ గావె సఖుఁడ!

౪

సీ॥ బువ్వమ్ముబంతులఁ ♦ గవ్వించి వయసుకా
వరముబ్బ పడుచులు ♦ పాడలేరు
గొబ్బితట్టెడువేళఁ ♦ గూడ కన్నెలెంత
లరమరలే కాడ ♦ మఱచినారు
తద్దెపండుగలపై ♦ తమయాల లూగుట
మోటుగా మగువలు ♦ మూసినారు
రుక్మిణిమొదలుగా ♦ రుచిగొన్న బొమ్మల
పెండ్లిండ్లు బాలలు ♦ విడచినారు
గీ. ఏ నిరపరాధమగు క్రీడ ♦ లింతవఱకు
జాతిముఖకళలనదగు ♦ చానలందుఁ
బెంచె సౌందర్యసుఖరుచి ♦ సంచయమ్ము
నా శుభము లస్తమించెడు ♦ నరయరేమొ?

ॐ

# ఒక మాట

౧

ప్రస్తరము హాస్తభూషణంబుగ ధరించి
నడతు వీవీథి నెవఁడవో పడుచువాఁడ!
మృదులముఖియు, నర్థోన్మత్తహృదయయైన
ఈ పరవశగాయనిఁబిల్తు రేమి పేర?

౨

పంకబద్ధములయి దిగఁబడెడు త్రోవ
లందుఁ గా ల్పైకలింపలే కలసి సొలసి
పోవు పాడియావులు తలంపునకుఁ దెచ్చు
భావగర్భనిర్భరములౌ పద్యగతుల.

౩

వృక్షమున నిగ్గుచేవ లూహించి గొప్ప
గండ్రగొడ్డండ్ర నఱకేటి కాష్టపతులు
స్మృతికిఁదెత్తు రయోమయశ్లేష కుటిల
కవచములు చీల్చు గూఢవ్యాఖ్యానములను.

౪

హారితశాటీకషణ మనోహరనితంబ
యయి ధరణి మేఘదౌత్యము నాదరించు

అమృతరసవతులై యొప్పె నఖిల వికసి
తార్ద్రసుమములు బాలెంతరాండ్రపోల్కి.

౫

పచ్చగిలిన వసుంధరా భాగ్యసీమ
నెల్లయెడలఁ గన్విందుగా నుల్లసిలుచు
పసుపుబూసిన ముత్తైదువల మొగాల
ననుకరించి గుమ్మడిపూవు లందమయ్యె.

౬

కలికితీగెలఁ బ్రణయముఁ జిలుకరించి
శ్రావణవనస్పతులు పచ్చిరసికులైరి
తెక్కలెత్తని బాలశారికలుఁగూడ
నీడముఖముల గుసగుస లాడదొడఁగె.

౭

కం. పలికించిన పలుకఁ డిపుఁడు
నలినేక్షణ! తెనుఁగుమీటినాడేమొ సుశీ
తలసుభగంబుగ నాతోఁ
బలుకుము నీవైన చెఱుకుపాలొలుకంగన్.

౮

గీ. మేళవించిన తీఁగెలమీఁద మీటి
యీ జగన్ముగ్ధవదము వాయింతొ? లేక

సఖుఁడు బెజ్జాలువేసి సాజంపు విరతు
లాడుగదీర్చిన వేణు వూఁదెదవొ? చెలియ!

౯

గీ. శ్రుతికిఁ జెవులొప్పగించి రుచు లుదయించు
స్వరకలాపమ్మునను మదిఁ వశముఁజేసి
బాహువులు సాచువాఁడ నీప్రణయసుఖసు
గంధబంధుర మగుభావబంధమునను.

౧౦

గీ. చనవులు, విలాసములు, మనోజ్ఞములు నయిన
భవదమృతరాగభోగబాంధవము లతివ!
నాకుఁ బొడగట్టుచున్న వింత యెడముండి
నను నతిస్పష్టముగ దర్పణమునఁ బోలె.

౧౧

గీ. పెదవికదలించి పలికిన పొదలపొంత
కదలుచున్నవి నవ్వులింకను శుభాంగి!
త్రెంచిపోసిన ముత్యాలతీరుఁదోప
సూత్రమెందుఁ బాతేసితో చూపవమ్మ!

# రాధపిలుపు

మూడునాళ్ళాయెరా మువ్వగోపాల
నినుజూడకేనింక నిలువజాలనుర!

*　　*　　*　　*

కనులలో మెదిలేవు కనకగోపాల
నీచక్కదనమెందు దాచుకోగలవు,
చాటుగా నిలుచుండి పాటబాడేవు,
మరుగున తలవంచి మాటలాడేవు,
ముసుగులో నేమిటో ముచ్చటాడేవు,
తెరలోను రాగాలు తీసేవు కృష్ణ!

*　　*　　*　　*

మురళివాయించరా వరహాలకృష్ణ!
నీజాడలను బట్టుకోఁజాలుదేను
గజ్జెలందెలుమ్రోయ కదపరాకాలు,
నీగుట్టుమట్లెల్ల నే నెఱుంగుదును,

*　　*　　*　　*

నెమలికుచ్చుతురాయి నిగనిగలాడి
నిను బట్టియిచ్చునంచును తీసినావె?
నీచుట్టుపచ్చగా వూచేనటంచు
బంగారు శాలువాపాతేసినావె?

ఎంతసేపాయెరా యౌవనాంతమున
నీకోసమొంటిగా ప్రాకులాడితిని,
ఎందెందు వెదకినా యీబృందయందు
నీవన్నలే కానరావేల కృష్ణ!

* * * *

పొదలలో పూవువై పోయినావేమొ?
ఆలలో దూడవై యఱిగినావేమొ?
తమ్ములతీయగా ద్రవియించితేమొ?
కలికివేణువుతోడ కరిగినావేమొ?

* * * *

నిన్నెందుజూతురా చిన్నారికృష్ణ!
ఏమూల వెదికేదిరా మోహనాంగ!

* * * *

వెన్నదొంగిలి కానిపింపకున్నావా?
చీరలెత్తుకపోయి దూరమైనావా?
తరుణులే నిను దారి తప్పించినారొ?
మధురలో పౌరులే మఱపించినారొ?

* * * *

ఏమిసేయుదునురా నాముద్దుకృష్ణ!
నినుజూడకేనింక నిలువజాలనుర

రాధను వేధింపరాదురా కృష్ణ
రాధపై కోపింప రాదురా కృష్ణ!
పిలిచిముద్దీయరా ప్రేమాలపించె
కలిసి క్రీడింపరా కళ్యాణకళిక!

# తిలకము

౧

కలిమికన్నియ కలికినుదుటను
కళలుచిమ్మె కనకతిలకమ!
వలపుకృష్ణుని వయసు తేనెకు
పాత్రమయ్యెతిలకమా!

౨

పార్వతీసతి ఫాలతలమున
గర్వరాగముఁ గ్రక్కుతిలకమ!
ధూర్వహుండగు ధూర్జటికి ధృతి
దూలఁద్రోసినతిలకమా!

౩

పలుతుపడతుక పసుపునొసటను
మొలకజీవము లొలుకుతిలకమ!
కలిసిబ్రహ్మను కంఠమొత్తగ
కౌగిలించిన తిలకమా!

౪

రచ్చకీడిచి రమణిద్రౌపది
కుచ్చెలలుకొని కోకలూడ్చిన
చిచ్చువలె నాచెలువమొగమున
విచ్చిమండిన తిలకమా!

౫

నరకుపైఁబడి కఱకుకోలల
సరకుసేయక సాహసముతో
నరకసాగిన నాటసత్యా
ననమునంటిన తిలకమా!

౬

వాడదకత్తులు వేటలాడే
కడిదిఘోరపు కదనసీమల
తడిసివీరుల పడుచునెత్తుట
ధన్యమయ్యో తిలకమా!

౭

పరిమళమ్ములు పంతమాడగ
పరువపుంజిగి పైకిపొంగే
సరసకాముక శయనగృహముల
చక్కబెట్టే తిలకమా!

౮

సిగ్గువలదని చెంపలేయగ
భగ్గుభగ్గని వచ్చువలపును
బిగ్గనిలిపే పెండ్లికూతురు
నిగ్గులేలే తిలకమా!

౯

ఇనుపసంకెల లేసిత్రోసిన
వనజముఖ దేవకిలలాటము
నెనసి కంసుని హృదయఫలకము
మొనవగిల్చిన తిలకమా!

# రామలింగారెడ్డి

శా. పిండీపిండని పాడియాఁబాదుఁగుర్లన్ బింబింప కాదంబినీ
కాండం, బుర్వరపచ్చకోకలను సింగారింప నీవేళ పూ
దండల్ దక్కను ద్వారబంధముల సంధానించి ప్రేమోదయా
ఖండస్వాగతమిత్తు రాంధ్రు లనురాగస్ఫూర్తి రెడ్డ్యగ్రణీ!

శా. ఆజన్మార్గ్మగమీరక దిగ్విజయకన్యాకంచుకంబా కుసుం
బాజెండా నెగగట్టి, వాఙ్మయసరోమాధ్వీపిపాసారతిన్
మోజుల్ మీరగ మాయనుంగు తెనుగుం బూదోటఁ బోషించిరే
రాజుల్, తత్ప్రతిభాంక రెడ్డికులధీరప్రాచురీచ్ఛాయనీ
తేజోరూపమునందుఁ జూచెదము ప్రీతిన్ రామలింగాగ్రణీ!

సీ. తొడిమయుఁ బూవు న ♦ దుకుపొందికలుసూపు
పదభావముల కొక్క ♦ పాన్పమర్చి
విడుపువన్నియ పెద ♦ వి మెఱుంగలదినట్ల
లంకారముల నర్ధ ♦ లక్ష్మినేలి
లతికనికుంజవ ♦ లయమల్లినరీతిఁ
గథకు తెంపులులేని ♦ గమకమిచ్చి
కలహంస కొలనియ ♦ లలఁ బ్రోదిగొనుభంగి
నుడుల కొయ్యారంపు ♦ నడలునేర్పి

గీ. రసికు రుచిరోపగూహాన ♦ ప్రమదమొకట
వీరునిజభుజాస్ఫాలనో ♦ ద్వేగమొకట

ప్రకృతి తనవశమైనట్లు ♦ ప్రతిభతోడ
భారతమ్మేలె నేకవి ♦ బ్రహ్మమౌళి.

చ. అతని తెనుంగుతీర్పులర ♦ హాస్యములన్ గ్రహియించి తత్ప్రభా
యుతజయాలేఖనీముఖ ని ♦ రంకుశపాలిత భారతీకళా
న్వితరసరేఖ రాగిలిన ♦ నేర్పరి వంచు, త్వదీయభావలా
లితవిలసద్విపంచిఁ గది ♦ లింతుము నేఁడు కుతూహలంబునన్.

సీ. చవిఁజూచితి స్వతంత్ర ♦ చైతన్యభావనా
మాంసలాంగలకవి ♦ హంససూక్తి
పాటించితివి స్వైర ♦ భావభోగరిరంస
నెసఁగుపరాసుల ♦ రసికలిప్స
క్రీడించితివి పార్ధి ♦ పేడెత్తు సూరన
సుకవివాగ్దోహద ♦ శోభనమున
వెలయించితివి కండ ♦ గల తెనుంగునఁ గావ్య
తత్త్వమానందసూ ♦ త్రముల సరణి

గీ. నేఁడు నీకన్న నెయ్యాధు ♦ నిక మహాంధ్ర
వాఙ్మయమునడిపింప నె ♦ వ్వాఁడు సమర్థు
డెలమి నీకంకణము ధరి ♦ యించి ముందు
త్రోవదీయుము రామలిం ♦ గావతంస!

# కలియుగార్జునుడు

(శ్రీ గుండవరపు అప్పారావుగారు.)

ఉ॥ కూరిమి వీరదంపతుల ♦ కుఁ జనియించిన భారతీయు, లా
చారతపోధురీణులయి ♦ సాధనఁజేసి గడించి రేద్విష
ద్దారణదారుణంబయిన ♦ ధర్మధనుస్సు, తదీయ తేజ మిం
పారఁగఁగాచు మా కలియు ♦ గార్జును నప్పయధన్వి నెవ్వఁడున్.

సీ. విన్నాము కడుపులో ♦ నున్న కండలు కద
లంగ భారత రణ ♦ రంగచరిత
చెవియొగ్గినాము, పు ♦ చ్చినశల్యములు మాంస
గింప రామాదుల ♦ యుంపకోఁత
ఆలించితిమి గుండె ♦ లదరఁ బల్నాటి వీ
రుల గండ్రగొడ్డండ్ర ♦ రోషపదము,
అవధరించితిమి క ♦ న్గవ వేడియెఱుపెక్క
రాజపుత్రుల యుల్లె ♦ త్రాళ్లమ్రోత
గీ. భావము నంతెకాని మా ♦ పాపవశతఁ
జూచినఁ, చూడగా ♦ నోచలేదు
నేటికి ధ న్నెత్తి నం ♦ ధించినావు
మా యదృష్టంబిదియె అప్ప ♦ రాయధన్వి!

ఉ. వ్రాసినవ్యాసవాక్యముల ♦ భావభరంబెఱుగంగలేని స
న్న్యాసుల, మిట్టిమీఁదగతి ♦ నమ్మునకుం దగువీరగౌరవో
ల్లాసము నెట్టుసల్పఁగఁగ♦లారము, మాటలులేనిమూఁదు వి
శ్వాసమె పచ్చకప్పుని ♦ వాళిగ గైకొను మప్పరాణ్మణీ!

సీ. వల్లెఁజెప్పిన వేద ♦ పన్నాలువర్జించి
బాణదేశికుడైన ♦ ద్రోణుశక్తి
మంత్రోదకముల ని ♦ ర్మలమైనచేదోయి
రక్తాంజలిడిన భా ♦ర్గవిసుదీక్ష
అమృతతేజోభూత ♦ మయిన గంటమువీడి
కత్తిదాలిచిన తి ♦క్కనయుశస్సు
గోచీవడల్చి కం ♦ గులవీరకాశేఁగ
ట్టిన యాఁపోతి ధీ ♦ యుసి తపస్సు

గీ. బ్రాహ్మణుడవయి ధనువుఁజే ♦ పట్టినట్టి
నీభుజాయుగళీపీఠి ♦ నిలుచుగాత
ఆంధ్రలోకద్రోణాచార్యుఁ ♦ డనెడికీర్తి
మోయుదువుగాత శ్రీయాప ♦ నారాయధన్వి!